అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రిచేఁ

ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 18 { 1927 సం॥ జనవరి నెల. } సంచిక 10

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు రు 25 0 0 సహాయులకు రు 5 0 0

పోషకులకు రు 10 0 0 చందాదారులకు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

ప్రధానపోషకులు

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, వెనికేపల్లి.
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, గార్ల
౩ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు. యాదవరం.
౪ రామసింగుగారు- నెల్లుట్లసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల.
౫ శ్రీమద్వెంకటశేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, అల్లాదుర్గసంస్థానము.

పోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు,
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ.
౩ రాజా వెంకటాద్ర్యప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు.
౪ రాజామంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి.
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు.
౬ శ్రీరామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము.
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి, దేశముఖుగార్లు- నారాయణపురము
౧౦ టి. లక్ష్మణసింగుగారు, జొనగాం
౧౧ నెల్లుట్ల నరసింహారావుగారు, జొనగాం
౧౨ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె.
౧౩ పేరులపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౪ జాగర్లమూడి కుప్పుస్వామినాయఁడుగారు, కారంచేడు
౧౫ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౬ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, సిరిసిల్ల.
౧౭ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానుకొండూరు
౧౮ తిరుమలకల్యాణ్ చక్రవర్తి వరదాచార్యులఅయ్యవార్లంగారు-శాతాపురం
౧౯ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం

సహాయులు

౧ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ
౩ సంగెం రామారావుగారు, సంగెం
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట

అభినవసరస్వతి.

సంపుటము ౧౨ { జానపాడు క్షయ సం|| పుష్య మాసము } సంచిక ౧౦

భార్యలపాలిఁటి మృత్యుదేవతలు.

—* పంచరత్నములు. *—

చ|| తనుఁగని పెంచినట్టి తలి * దండ్రుల, సోదరపాళి వీడి నా
థున కనలేవటుంచుఁ దమ * తో సుఖదుఃఖము లొందు కాంతలన్
జనవునఁ జేరఁదీసి ఘన * సౌఖ్యము లీయక వేపుచున్నదా
వనటలఁ ద్రోయువారెకద * భార్యలపాలిఁటి మృత్యు దేవతల్ !

ఉ|| మానిని నమ్మలేక యను * మానము మానక సొమ్ము వెట్టక
య్యానకుఁ జేరి, దేహమున * నంతట వాతలు వైచి గాశిలన్
హీనత నెంచి, యిల్లు వెడ * లించి, విసిగ్దయఁ గొట్టుచుందుదిగ్
ప్రాణముఁ దీయువారెకద * భార్యలపాలిఁటి మృత్యుదేవతల్ ! ౨

ఉ|| ఆలిని మోసపుచ్చి, వెల * యాలికి సర్వధనంబులిచ్చి, జా
రాలకుఁ బుట్టినిల్లయి, స * దా మధుపానమునం బ్రమత్తులై
కూళలసంగతిం దిరిగి * క్రూరపుఁజేతల మూలమైన పా
పాలొనరించు వారెకద * భార్యలపాలిఁటి మృత్యుదేవతల్ ! ౩

చ|| పరసము, సత్ప్రవర్తనము * సజ్జనసంగతి, సద్యశంబునుం
గరము నొసంగు విద్య కుల * కాంతలకుం దగదంచు నెంచి యే
తరిని గృహంబులోననిడి * తాళములం బిగిలంబొనర్చి, స్వే
చ్ఛ వయం నీనివారెకద * చానలపాలిఁటి మృత్యుదేవతల్ ! ౪

చ|| వదువులఁ బ్రొద్దుఁ బుచ్చుటను * సార్థకమౌ నరజన్మమంచు, స
త్పథముల నేర్పు గ్రంథములఁ * దద్దయుఁ గాంచెను స్త్రీలఁ జూచి, యి
య్యది కులటంచు, నాఁటకము * నందుచు నారడిఁ బెట్టివారలం
బ్రదుకఁగ నీనివారె కద * భార్యలపాలిఁటి మృత్యుదేవతల్ ! ౫

భారతము.

ఏ గ్రంథరాజశ్రవణపఠనాదులు శివాజి మొదలగు మహారాష్ట్రులైన దేశభక్తులకు నధికోత్సాహమును, బలము గలిగించి దేశద్రోహుల నిర్మూలముచేయఁ బురికొల్పెనో, ఏ యుద్ధగ్రంథము పాశ్చాత్యులచే వేదములతోఁ దులఁదూఁగి పంచమ వేద మని పొగడ్తఁగనెనో, యట్టి శ్రీమహాభారతమును దద్గ్రంథకర్తను, దద్వర్ణనాకౌశలంబును, దద్రసగుంభనమును, వృత్తరీతుల వైదగ్ధ్యంబును, పాకవిశేషంబును, గథాకల్పనయు, రచనాకౌశలంబును దెలియంగనివాఁడు మన భరతఖండమున నెవ్వఁడు నుండఁడు.

ఇంత పెద్దదియు, నింతటి మహిమగలదియు, రమ్యకథాసన్నివేశముగలదియు, సర్వధర్మనీతిమతాచార భక్తివైరాగ్య లౌకికవైదిక వ్యవహారబోధకంబును, బ్రతిపద్యరసాస్పదంబును, మృదుమధుర పదగుంభితంబును నగు గ్రంథమును సంస్కృతమునఁగాని యాంధ్రమునఁగాని మన హిందూదేశమున మఱియొకటి లేదని నొక్కివక్కాణింపనగును.

ఇట్టి శ్రీమహాభారతము తొల్లి సంస్కృతమునఁ బరాశరపుత్రుఁడగు వేదవ్యాసమహర్షిచే రచింపఁబడియె. ఈ వేదవ్యాసమహర్షి కాల మిద్దియని నిశ్చయించి చెప్పుటకుఁ దగిన యాధారము లేవియుఁ గానరావు. చరిత్రకారు లన్నిచరిత్రాంశములను, జర్చించి వివరించి యున్నారు. కాని యీ మహర్షిచరిత్ర మెచ్చటను వివరింపరైరి.

ఈ భారతమును బరీక్షితుని కుమారుఁడగు జనమేజయమహారాజు చేయుచున్న సర్పయాగమునకు వేదవ్యాసులు వచ్చినట్లును, నా రాజు తన తాతలచరిత్రమును జెప్పుమని వ్యాసమహర్షి నడుగ నతఁడు తన శిష్యుఁడగు వైశంపాయనునిఁ జెప్పు మని నియోగింప నాతఁడు చెప్పుచుండఁగా విని వచ్చి రోమహర్షణపుత్రుఁడగు నుగ్రశ్రవసుఁడు నైమిశారణ్యవాసులగు శౌనకాదిమహర్షులకుఁ జెప్పినట్లును నా మహాభారతపీఠికయందే వ్రాయఁబడి యున్నది. దీనివలన ధృతరాష్ట్రునకుఁ దండ్రియగు వ్యాసమహర్షి తన మనుమల మనుమఁడగు జనమేజయుని కాలమువఱకు నుండినట్లు స్పష్టమగుచున్నది.

జనమేజయుఁడు కలియుగ ప్రారంభమున నలువదిసంవత్సరములు గడిచినపిదపఁ బ్రభుత్వమునకు వచ్చినట్లు కనఁబడుచున్నది. ఎట్లనః— జనమేజయుఁడు తన మంత్రులను దన తండ్రి నేల తక్షకుఁడు గఱచెనని యడుగ నా మంత్రు లందుకుఁ గారణము చెప్పినప్పుడు

శ్లో॥ "ప్రజా ఇమా స్తవపితా షష్టివర్షా ణ్యపాలయత్
తతో దిష్టాంత మాపన్నః సర్వేషాం దుఃఖ మావహత్
బాలఏ వాభిషిక్త స్త్వం సర్వభూతానుపాలకః॥ భా. ఆ. అ. ౪౯.

అని చెప్పియున్నారు.

జనమేజయునితండ్రియగు పరీక్షిత్తుడు కలియుగము మొదటిదినమున పట్టాభిషిక్తుఁడైనట్లు క్రింద వివరింపఁబడిన హేతువులవలన స్పష్టము గాఁగలదు.

శ్రీకృష్ణపరమాత్మనుగూర్చి ముచికుందుఁడు చెప్పుచున్నాఁడు.

శ్లో॥ ముచికుందశ్చ తత్రాదౌ వృద్ధగార్గ్యవచః స్మరన్
సంస్మృత్య ప్రణిపత్యైనం పరం సర్వేశ్వరం హరిమ్
ప్రాహ జాతో భవాన్ విష్ణో రంశ స్త్వం పరమేశ్వరః
పురా గర్గేణ కథిత మష్టావింశతమే యుగే
ద్వాపరాంతే హరే ర్జన్మ యదువంశే భవిష్యతి॥

హరివంశమునఁ బూర్వభాగమున ౫౪వ అధ్యాయమున యోగమాయనుగూర్చి విష్ణువు చెప్పుట—

శ్లో॥ తత్రాహం సంభవిష్యామి దేవకీజఠరే శుభే
గర్భే త్వయా యశోదాయా గంతవ్య మవిలంబితమ్
ప్రావృట్కాలే చ నభసి కృష్ణాష్టమ్యాం మహానిశి
ఉత్పత్స్యామి నవమ్యాం చ ప్రసూతిం త్వ మవాప్స్యసి॥

పూర్వోక్తవచనములఁ బరిశీలించిన శ్రీకృష్ణపరమాత్మ ద్వాపరయుగాంతమునవర్షఋతువందు శ్రావణబహుళాష్టమి నాఁడు నిశీథమున నీ భూలోకమున నవతరించినట్లు స్పష్టమగుచున్నది.

భాగవతమున నేకాదశస్కంధమున నాఱవయధ్యాయమున శ్రీకృష్ణపరమాత్మను గూర్చి బ్రహ్మాదిదేవతలు చెప్పుమాట—

శ్లో॥ యదువంశే౽వతీర్ణస్య భవతః పురుషోత్తమ
శరచ్ఛతం వ్యతీయాయ పంచవింశాధికం విభో॥

విష్ణుపురాణము, అంశము ౫ అధ్యాయము ౩౭ కృష్ణమూర్తిని గుఱించి ఇంద్రప్రేషితదూతోక్తి—

శ్లో॥ పంచవింశత్యుత్తరకం శతం తు శరదాం గతమ్ ।
ఇదానీం గమ్యతాం స్వర్గః భవతే యది రోచతే॥

ఈవచనములవలన శ్రీకృష్ణుఁడు భూలోకమునం దవతరించినది మొదలు దేవతలు వైకుంఠమునకు రమ్మని పిలువవచ్చునంతవఱకు 125 సంవత్సరములు గడచిన వని తేటపడుచున్నది. విష్ణుపురాణము అంశము ౪ అధ్యాయము ౨౪.

శ్లో॥ యస్మిన్ కృష్ణో దివం యాతః తస్మిన్నేవ తదాహని
ప్రతిపన్నం కలియుగం తస్య సంఖ్యాం నిబోధత॥

దీనివలనఁ గృష్ణుఁడు పరమపదముఁ జేరినదినము కలియుగముయొక్క మొదటి దినమనునట్లు విదిత మగుచున్నది. పూర్వోక్తము లగువచనములు కన్నిటికి నేకవాక్యత కల్పించినఁ దెలియంబడిన దేమనిన—

కృష్ణపరమాత్మ ద్వాపరయుగాంతమున వర్షర్తువునందు శ్రావణబహుళాష్టమి నాఁడు నిశీధమున నీలోకమున నవతరించి 125 సంవత్సరములు భూమియందుండి కలియుగప్రారంభ దినమునఁ బరమపదముఁ జెందినట్లు స్పష్ట మగుచున్నది.

సీ॥ భారతసంగ్రామపారీణుఁడై జయారమ యెల్లఁ జెల్ల సామ్రాజ్యమునకుఁ
బాండవముఖ్యునిఁ బట్టంబు గట్టినయది యాదిగాఁగ ముప్పదియు నైదు
సంవత్సరమ్ములు సన ననంతరవత్సరంబునఁ బ్రజకు భీషణం బౌనట్టి
యుత్పాతములు పుట్టె ... ...

సీ॥ ఇట్లు ప్రతిదినమును నెన్నియేనియును మహోత్పాతములు పుట్టుచుండఁ గొంత
కాలంబు వోవంగఁ గౌంతేయముఖ్యుండు వినియె నొండొరులతోఁ బెనఁగి సర్వ
యాదవులును దెగి రంబుజనాభుండు హలధరుండును దక్క నని నరేంద్ర
విని ... ...

సీ॥ అంగనాదుల నింతులను గొని పురికేఁగి వసుదేవుఁ గాంచి యన్యాసుమతీశు
తోఁ దగ నిట్లనుఁ దొల్లి కౌరవబలక్షయము చూచితి నేఁడు సకలయాద
వులనాశనము గంటి నలఘుతేజోఘన యఖిలబాంధవహీన మైనయిచటి
మనువున వర్తింప మనసు గొల్పదు మున్న యున్న కాననమున కరిగివాఁడు
గీ॥ భవ్యతపమున నాబలభద్రుఁ గూడి, యేను దపమాచరించెద నింక మీర
లరసికొనుఁడు సర్వంబును నరుఁడు వచ్చె, నిందు మీపంపు సేతకై యిల్లి నేఁడు.

భా॥ మౌ॥ ఆ॥ ౧॥

పై పద్యములవలన ధర్మరాజు పట్టాభిషిక్తుఁ డయినపిదప ముప్పదియారవ సంవత్సరమున సకలయాదవులు నశించిరనియు వారు దెగినపిదప బలరాముఁడును గృష్ణుఁడును స్వస్థానముల నలంకరించిరనియు విదిత మగుచున్నది.

సీ॥ అర్జునుఁ డమ్మెయి నచ్యుతరామాదియాదవజనుల వృత్తాంతములును
దనదు తెఱంగు సత్యవతీతనూభవు హితభాషణంబులు నేర్పడంగఁ
జెప్పిన విని యుధిష్ఠిరుఁడు ప్రస్థానమ్మునకు మది యొలయ నన్నరునితోడ
... ...

క॥ అనుజుని నట్లు మహా, నాయకుఁ గావించి భటజనము గూర్చి మహా
నాయకుఁ డాచార్యులు కీర్తన, సేయఁ బరీక్షితుని రాజుఁ జేసె ధరణికిన్॥

భా॥ మహా॥ ఆ॥ ౧॥

దీనివలన బలరామకృష్ణులు పరమపదము చెందినపదంపడి యచటనుండి పోయిన యర్జునుఁడు వచ్చి యచ్చటివృత్తాంత మంతయుఁ జెప్ప విని ధర్మరాజు పరీక్షితునిఁ బట్టాభిషిక్తునిం జేసి తాను దమ్ములతోడ స్వర్గమునకుఁ బోయినట్లు స్పష్టమగుచున్నది.

పరీక్షితుఁడు భారతయుద్ధము జరిగినపిదపఁ బుట్టినవాఁడు గానఁ బట్టాభిషేకము నాఁటికి మున్ప్రాయము గలవాఁడని స్పష్టమగుచున్నది. ఇతఁడు 60 సంవత్సరములు ప్రభుత్వము చేసినట్లు జనమేజయునకు మంత్రులు చెప్పుమాటల వలనఁ దెలిసెఁ గాన 95 సంవత్సరములు జీవించె ననియు బాల్యముననే జనమేజయునకుఁ బట్టాభిషేకమాయె ననియుఁ దెల్లమగుచున్నది

కృష్ణుఁడు తనయవతార మాపగా 125 సంవత్సరములు భూలోకమునుండి కలియుగము మొదటిదినము వైకుంఠమునకుఁ బోయినట్లు పైని నిర్ణయింపఁబడినది. కానఁ గొంచె మించుమించుగ నీకృష్ణపరమాత్మకు సమానవయస్కులగు పాండవులును 125 సంవత్సరములు జీవించి 89 సంవత్సరమునఁ బట్టాభిషిక్తులయి 36 సంవత్సరములు ప్రభుత్వము చేసి 126 సంవత్సరమున కలియుగమున నాల్గయిదు దినములు గడచినపిదప స్వర్గంబునకుఁ బోయినట్లు నిర్ధరింపవచ్చును.

ధృతరాష్ట్రాదుల పుట్టుక నాఁటికి వ్యాసమహర్షి గపిలగడ్డము గలవాఁడని చెప్పియుండుటచేత నప్పటి కాతఁడు 25 సంవత్సరములైన నుండవచ్చును. పాండు మహారాజు చనిపోవునప్పటికి ధర్మరాజాదులు శిశువులుగా నుండిరని చెప్పియుండుటచేత నతనికి 140 సంవత్సరములకంటె నెక్కువ యుండదని తోఁచెడిని. గానఁ బాండవుల జననము నాఁటికి వ్యాసమహర్షికి 65 సంవత్సరము లుండవచ్చునని నిశ్చయముగఁ జెప్పవచ్చును.

పరీక్షిత్తు 60 ఏండ్లు రాజ్యముచేసి జనమేజయునకుఁ బ్రభుత్వము నిచ్చినట్లుండుటచే నతఁడు రాజ్యపాలనార్హుఁడై యుండెఁ దనవచ్చునుగదా! తక్షకుఁడై తండ్రిపగఁ దీర్చుకొనవలయునని సర్పయాగము చేయఁబూను నాఁటికి 25 సంవత్సరములు గలవాఁడై యుండవచ్చును. ఇతఁడు సర్పయాగము చేయుచుండ నప్పటికి వ్యాసమహర్షి వచ్చుట, జనమేజయుఁడు తనతాతలకథఁ జెప్పుమని యడుగ వైశంపాయనుని నియమించుట, యతఁడు చెప్పుట మున్న చెప్పియుంటిని గాన వ్యాసమహర్షికి భారతము చెప్పునాఁటికి 275 సంవత్సరముల వయస్సుండునని నిర్ణయింపఁ బడినది.

జనమేజయుఁడు కలియుగము మొదట 85 సంవత్సరములు గడచినపిదప సర్పయాగము చేసినట్లు స్పష్టమగుచున్నది. అప్పుడే భారతము రచింపఁ బడినది. ఇప్పుడు కలియుగ గతసంవత్సరములు 5027 ఇందు 85 పోయిన 4942 సంవత్సరములనాఁడు వ్యాసమహర్షి మహాభారతమును రచించెననియు నప్పటికి వ్యాసమహర్షికి 275 సంవత్సరముల వయస్సనియు దృఢముగఁ జెప్పఁబడుచున్నది.

మనుష్యులు నూఱు సంవత్సరములకంటె నెక్కువ జీవించుట యరుదనియు, యెక్కువైన నొక్కఁడు 110, 111 కంటె నెక్కువకాలము జీవింపఁడనియు వ్యాసులు 275 సంవత్సరములు జీవించి తనచరమావస్థయందు నిట్టి యత్యద్భుతమగు గొప్పగ్రంథము రచించె ననుట విశ్వసనీయము కాదనియు, వ్యాసులనువా రెక్కఁడుం బుట్టియుండ రనియుఁ గొందఱ యభిప్రాయము.

పాండవధార్తరాష్ట్రులకు విద్యచెప్పిన కృపాచార్యులు పరీక్షిత్తునకి గురువుగానుండి యతనిచేత మూఁడశ్వమేధంబులు చేయించినట్లు భాగవతము వలనను భారతము వలనను స్పష్టమగుచున్నది. కృపుఁడు పాండవాదులకుఁ జదువు చెప్పఁబూనుకొను నప్పటికి 20 సంవత్సరములకంటె నెక్కువయె యుండవచ్చును. పాండవాదులకు 10, 11 సంవత్సరము లుండవచ్చును. కానఁ బరీక్షితుని మరణము నాఁటికి 187 సంవత్సరములు కృపాచార్యున కుండవచ్చునని యూహింపవచ్చును. వ్యాసమహర్షి కంటెఁ గృపాచార్యుఁడు 88 సంవత్సరములు చిన్నవాఁడని తోఁచుచున్నది. మనుష్యుని జీవితము సామాన్యముగ నూఱుసంవత్సరములని వాదించు వీరు కృపుని జీవితకాలము 187 సంవత్సరములని విశ్వసించుచో వ్యాసుని జీవితకాలమును విశ్వసింపవలయును. పాండవులు స్వర్గమునకుఁ బోవునపుడు వ్యాసమహర్షి యేమాయెనో యెవ్వరికిఁ దెలియదు గాని కృపుఁడు మాత్రముఁ బరీక్షిత్తునకి గురువుగా నియమింపఁబడినట్లును నతఁడు పరీక్షిత్తుచేత మూఁడశ్వమేధంబులు చేయించినట్లును ఘంటాఘోషముగ భారత భాగవతములయందుఁ జెప్పఁబడి యుండుటచేఁ గృపుఁ డన్ని సంవత్సరములు బ్రతికినట్లొప్పుకొనక పోరాదు. ప్రకృతము ఇంగ్లండు మొదలగు దేశములందుఁ గొందఱు 170 సంవత్సరములు బ్రతికియుండినట్లు వార్తాపత్రికలవలనఁ దెలియవచ్చుచున్నది. ఇప్పటివారికంటెఁ బూర్వకాలపువా రమితబలాఢ్యులనియు, నెక్కువకాలము జీవించుచుండిరనియు నధికబుద్ధిమంతులనియు నొప్పుకొనుచున్నారు. కాన వ్యాసమహర్షి యన్నియేండ్లు జీవించెనా యని సందేహింప నక్కఱలేదు. కృపుఁ డన్ని సంవత్సరములు జీవించియుండినది భారత భాగవతములు కంఠోక్తముగఁ జెప్పియుండుటవలన విధిలేక యొప్పుకొని తీరవలయును, గాన వ్యాసమహర్షియు నన్ని సంవత్సరములు జీవించి యుండుట సంభవమనియు వ్యాసులే భారతము నంతయు రచించె ననియు నిస్సందేహముగ నొప్పుకొనవచ్చును.

ఇది భారత భాగవత విష్ణుపురాణాది గ్రంథముల నాధారముగఁ జేసికొని నిర్ణయించిన భారతకాలము. ఇంకఁ జరిత్రగ్రంథముల విచారింతము. హిందూదేశ కథాసంగ్రహమున రామాయణభారతములు శాస్త్రయుగాంతమునను బౌద్ధయుగారంభమునను రచింపఁబడినట్లు సహేతుకముగ నిర్ణయింపఁబడి యున్నది. (41 పే) శాస్త్ర

యుగము క్రీస్తునకుఁ బూర్వము 1400—1000 వఱకునని యచ్చటనే నిర్ణయింపఁ బడినది. ఆంగ్లుల చరిత్రలను యుధిష్ఠిరాదులు క్రీస్తునకుఁ బూర్వము పదుమూఁడవ శతాబ్ద ప్రాంతమున హాస్తినాపురిఁ బాలించుచుండినట్లును, కుటుంబము పెద్దదగుటచే హాస్తినాపురి చాలక పోఁగా దానికి సమీపముననున్న ఖాండవ వనమును నఱికి యచట నాగులఁబాఱఁదోలి యచ్చట నింద్రప్రస్థమును గట్టినట్లును వ్రాయఁబడియున్నది. పరీక్షిత్తునిఁ జంపిన సర్పములఁ జంపుటకై జనమేజయుఁడు సర్పయాగముచేసిన దచ్చటనే యనియు నిరూపింపఁ బడియున్నది. ఈ రెండు గ్రంథములును నేక వాక్యతను గొంచె మించుమించుగాఁ బొందియున్నవి. కాని పురాణగ్రంథములకును జరిత్రగ్రంథములకు నేకవాక్యత కుదురలేదు. చాల వ్యత్యాస మున్నది. పురాణోక్త కాలము క్రీ॥ వె॥ 20 శతాబ్దములు. క్రీ॥ పూ॥ 30 శతాబ్దములు. అంతు భారతరచనకాలము 50 శతాబ్దములగుచున్నది. రామాయణమున భారతకథ యేమియు లేకపోవుటయు, భారతమున రామాయణకథ యుండుటవలన భారతమునకంటె రామాయణము ముందు రచింపఁబడియెనని నిర్ణయింపవచ్చును. భారతమునకు రామాయణమునకుఁ బురాణములలోఁ జెప్పఁబడిన యుగభేద ముండఁగా నొక శతాబ్దమైనను పౌర్వాపర్య ముండకపోదని నా నమ్మకము. అట్లయినచో రామాయణము క్రీస్తునకుఁ బూర్వము 13వ శతాబ్దములోను భారతము పండ్రెండవ శతాబ్దముయొక్క ప్రారంభమునందును రచింపఁబడి యుండవలయును. చరిత్రగ్రంథములనుబట్టి భారత కాలమిప్పటికి క్రీ॥ పూ॥ 12 శతాబ్దములు క్రీ॥ వె॥ 20 శతాబ్దములు 32 శతాబ్దములైనట్లు స్పష్టపడుచున్నది. పురాణములఁ బరిశీలించిన క్రీ॥ పూ॥ 30 శతాబ్దములు క్రీ॥ వె॥ 20 అంతు 50 శతాబ్దములయినట్లు తెలియుచున్నది. పురాణములకును, చరిత్రగ్రంథములకును 18 శతాబ్దముల వ్యత్యాసమున్నది. ఇంతియకాక పురాణముల కాలమునుబట్టి భారతము చరిత్రగ్రంథములలో నిర్ణయించిన వేదముల కాలమునకంటెను ముందే రచింపఁబడినట్లు తేటపడుచున్నది. చరిత్రగ్రంథములలో ఋగ్వేదము క్రీ॥ పూ॥ 20 శతాబ్దములకు ముందు వ్రాయఁబడినట్లు నిర్ణయింపఁబడినది. ఇందేది నిశ్చయమో యేది యబద్ధమో దేవుఁడే యెఱుంగవలయును. ఏయాధారములనుబట్టి వా రాలాగున నిర్ణయించిరో తెలియదు. వేదములయందుండు వర్ణనలనుబట్టి యాలాగు నిర్ణయించి యుండవచ్చునని యూహించెదను.

భారతమునందలి వర్ణనలనుబట్టి చూడఁగా హిందూదేశ మప్పటికి మంచిస్థితియందుండి మంచి నాగరికతగలిగి ధనసంపత్తిగలదై యితరదేశములతో వాణిజ్యాదుల నొనర్చుచున్నట్లును, [illegible] నాయకులు సామంతరాజు లున్నట్లును, ననల్ప శిల్పవిద్య నెంపొంది యున్నట్లును స్పష్టమగుచున్నది. (ఆ॥ భా॥ స॥)

రామాయణవర్ణనలం బరిశీలించిన దేశమరణ్యమయమయి రాక్షసభూయిష్ఠములయి మహమ్మదీయకాలమునందువలె జను లెప్పుడును భయభ్రాంతులై సుఖరహితులయి యున్నట్లు స్పష్టపడుచున్నది.

మఱియు వేదములు క్రీస్తునకుఁ బూర్వము 20 శతాబ్దములనాఁడు వ్రాయఁబడినవనియును, అప్పటికి హిందూదేశములో గ్రామనగరాదులే లేవనియు, నచ్చటనుండు వార లాదేశప్రజలు గారనియు, మధ్యాసియానుండి బయలుదేఱివచ్చి పేషావరుకొద్ద కనుమలమార్గమున నీ దేశములోనికి వచ్చి సింధునదీతీరముల విడిసి క్రమక్రమముగా వృత్తులను సంపాదించుకొని ప్రయోజకులయి రాజ్యములను సంపాదించుకొని నానాఁటికి గొప్పస్థితికి వచ్చిరనియుఁ జరిత్రము లుద్ఘోషించుచున్నవి.

కంఠరవముగఁ జెప్పినపురాణములలోని కాలమే భారతకాలము నిర్ణయించిన భారతమునాఁటి దేశస్థితి యెంతయు బాగుగ నుండినట్లుండ భారతమున కవల రచింపఁబడిన వేదములనాఁటి దేశస్థితి పైని వర్ణించులాగున నున్నదని చెప్పుటకు నాధారము లేవియో యెఱుకపడవు. వేదములయందుఁగాని పురాణములయందుఁగాని ఇతిహాసములయందుఁగాని కావ్యములయందుఁగాని హిందూదేశములోని జనులు మధ్యాసియాలో నుండి వచ్చినట్లు చెప్పఁబడి యుండలేదు. మధ్యాసియాలోనుండి వచ్చినదే వాస్తవమైనఁ బై చెప్పిన గ్రంథములయందు నెచ్చటనైనను మే మచ్చటనుండి వచ్చినవారమని చెప్పఁబడి యుండదా? ఆ గ్రంథములయందు నెన్నియో విషయములు విచారింపఁబడియుండ ముఖ్యమగు నీ విషయము విచారింపఁబడకపోవునా? మధ్యాసియాలో స్థలము చాలక యన్నవస్త్రములకుఁ గఱవయి బాధపడుచుండ "మన మీ దేశమున జీవింపఁజాలము. హిమాలయపర్వతముల కావల మంచిదేశమున్నదఁట, అచ్చటికిఁ బోవుదము" అని యొకరితో నొకరు చెప్పుకొన్నట్లుండదా? ఎన్నియో నాళ్ళుగ నున్న దేశము వదలి వచ్చునప్పుడు దుఃఖము రాకయుండునా? అట్లు దుఃఖపడిన దెచ్చటనైన వర్ణింపఁబడియున్నదా! ఎచ్చటను గానరాదు. ధర్మరాజు భీష్మాచార్యులవారి నెన్నియో విషయము లడిగి చర్చించియున్నాఁడు. పరీక్షితుఁడు శుకాచార్యుల నెన్నియో విషయముల నడిగియున్నాఁడు. వారెవ్వరైనను దొల్లి మన మెచ్చటనుంటిమి, అక్కడనుండి ఇచ్చటికి నేలవచ్చితిమి, ఎన్నిసంవత్సరములక్రిందట వచ్చితిమి, అప్పటి దేశస్థితి యెట్లుండెనని యడిగియుండరా? ఎన్నియో రహస్యముల నడిగిన వారు రహస్యతమ మగు నీ విషయము నడుగక యుందురా? కావున నిదియంతయు నూహాపోహలచేఁ గల్పింపఁబడినదే కాని నిశ్చయమని చెప్పుటకు వీలులేదు. ఋక్కులయందలి విషయములఁబట్టి దేశస్థితి యీలాగున్నట్లు నిర్ణయింపవలయునని యందురేమో! ఓపూ

షుఁడా! మా ప్రయాణముఁ బూర్తిచేయుటకు మాకు సాయముసంగుము. అన్ని సంకటములు నివారింపుము. ఓ పూషుఁడా! మమ్ముఁ బెడత్రోవను దీసికొని పోవు వానిని మమ్ముఁ గొట్టువానిని దోఁచుకొనువానిని మాకుఁ గీడొనరించువానిని మాత్రోవ నుండి తొలఁగింపుము. ఇవి మొదలగు బుక్కులకు మధ్యాసియానుండి వచ్చునార్యుల నిచ్చటనుండు ననార్యు లడ్డగింప వారినిఁ బాఱఁదోలఁ బూషునిఁ బ్రార్థించిరని యేల యర్థము చేయవలయును. హిందూదేశమున నుండువారే యొకదేశమునుండి మఱియొక దేశమునకుఁ బోవుచు మార్గమధ్యమునఁ దమ్మెవ్వరైన నడ్డగించి తమ ప్రయాణమునకుఁ బ్రతిరోధకముఁ గావింపకుండ నుండునట్లు చేయుమని పూషునిఁ బ్రార్థించిరని యేల చెప్పఁగూడదు. ప్రకృతము సురక్షితమగు నాంగ్లేయప్రభుత్వమునందును రైలుమార్గమునఁ బ్రయాణము చేయువారు సహితము “ అగ్రతః పృష్ఠతశ్చైవ పార్శ్వయోరుభయోరపి । ధనుర్గృహీత్వా సుభుజౌ రక్షేతాం రామలక్ష్మణౌ ” అనియును, “ యశ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వమంగళా । తయో స్సంస్మరణాత్ పుంసాం సర్వతో జయమంగళమ్” అని చెప్పుకొని ప్రయాణముచేయుట సుప్రసిద్ధమై యున్నది. దీనింబట్టి “ యాంగ్లేయుల ప్రభుత్వమున దొంగలు విశేషముగ నుండిరి. ఆ దొంగలవలన భయములేకుండఁ జేయుమని రామలక్ష్మణులఁ బ్రార్థించుచుండి”రని కల్పన చేయవచ్చునుగదా! ఈ కల్పన సాధువని యెవ్వఁడైన ననునా? ఇప్పు డెక్కడనైన దొంగలును వానివలని యపాయములును లేవా? వానివలని భయములేకుండఁ జేయుమని దేవుని వేడుకొనఁగూడదా! మనుష్యులకు సుఖదుఃఖములు సహజములు, హానివృద్ధులు సామాన్యములు. అవి కలిగినప్పుడు మనుష్యులు భగవంతునిఁ దమ యిష్టదేవతను ధ్యానించుట స్వభావసిద్ధము. అట్లే తమకు హిందూదేశమున నుండువారికే కష్టములు ప్రాప్తించి యుండవచ్చును. వా రాకష్టములఁ బోఁదోల నాలాగు ప్రార్థించి యుండవచ్చును. అంతమాత్రమున దేశమంతయు నాలాగున నుండి యుండెనని కల్పించుట యంత రమణీయముగ నుండలేదని నాకుఁ దోఁచెడి. కాఁబట్టి కంఠోక్తములగు ప్రబలతరప్రమాణములు దొరకునంతకు నేదియు నిదమిత్థమని నిర్ణయింపరాదు.

భారతమును దొల్త వ్యాసమహర్షి వైశంపాయనమహర్షికిఁ జెప్పినట్లు నాతఁడు జనమేజయునికిఁ జెప్పినట్లును నది విని వచ్చి రోమహర్షణపుత్రుఁడు శౌనకాదులకుఁ జెప్పినట్లును పీఠికయందు వ్రాయఁబడి యుండుటచేఁ బ్రకృతము ముద్రింపఁబడియుండు భారతము వ్యాసమహర్షిచేఁ జెప్పఁబడినది గాదు, వ్యాసమహర్షి భారతమును నింతపెద్దదిగ వ్రాయలేదు, ఆయనచే వ్రాయఁబడిన భారతము ౮ వేలు శ్లోకములు గలదియే, దీనిని సూతపుత్రుఁ డుగ్రశ్రవసుఁడు రచించెనని కొందఱు తలంతురు. ఇది పొరపాటని

తోఁచెడి. పూర్వకాలపుఁగవులు సుఖముగ బోధపడుటకును, గ్రంథము పరంపరాప్రాప్తమయినదని గ్రంథముపై గౌరవప్రతిపత్తులు గలుగుటకొఱకును నాలాగున నొకరికొకరు చెప్పినట్లును వ్రాసికొనుట సంప్రదాయసిద్ధము. రామాయణము వాల్మీకి మొదట లవకుశులకుఁ జెప్పినట్లు వారయోధ్యకుఁబోయి రామసన్నిధిని నా రామాయణము గాన మొనర్చినట్లును రామాయణ ప్రారంభమున వ్రాయఁబడియున్నది. "తపస్స్వాధ్యాయనిరతం" అను శ్లోకము మొదలుకొని యా సర్గమంతయు ననఁగా బాలరామాయణము వాల్మీకి చెప్పినాఁడు.తక్కినదంతయు లవకుశులు చెప్పిరని కల్పించుట యుక్తమా? నాటకములయందు సూత్రధారుఁడు నాందీపద్యమును జదివిపోయినతోడనే నటీసూత్రధారులు ప్రవేశించి నాటక కథాసంసూచన పద్యములతోను వాక్యములతోను దాము చెప్పినట్లు "ఆర్య ఇయమస్మి ఆజ్ఞాపయతు కోనియోగోఽనుష్ఠీయతామ్. సూత్రధారః- యద్గేహే కలకంఠనాదమధురం. నటీ-సభయం నాట్యసామగ్రీం సమగ్రీకర్తుం విలంబితమ్. సజ్జీకృతా ఖల్వేషా. కేనపునారూపకేణ ప్రయోగఉపక్రమ్యతామ్. అని చెప్పుచున్నారు గదా ! ఈశ్లోకములు ఈపద్యములు నటీసూత్రధారులు చెప్పినవని యనవచ్చునా? వారు చెప్పినట్లు కవిచేఁ జెప్పఁబడినవిగదా. అట్లు వ్యాసుఁడే వైశంపాయనాదులు చెప్పినట్లు చెప్పినాఁడని చెప్పనొప్పును గాని అన్యకర్తృకములుగఁ జెప్పుట యుక్తమని తోఁపదు.

వ్యాసుఁడీ భారతమును, నిందలికథ జరిగినపిదప కథానాయకు లందఱు గతించిన పదంపడి వ్రాసిన ట్లీ క్రిందిశ్లోకములవలన నేర్పడుచున్నది

మాతుర్నియోగా ద్ధర్మాత్మా గాంగేయస్యచ ధీమతః
క్షేత్రే విచిత్రవీర్యస్య కృష్ణద్వైపాయనః పురా
త్రీ నగ్నీనివ కౌరవ్యాన్ జనయామాస వీర్యవాన్
ఉత్పాద్య ధృతరాష్ట్రంచ పాండుం విదుర మేవచ
జగామ తపసే ధీమాన్ పునరే వాశ్రమం ప్రతి
తేషు జాతేషు వృద్ధేషు గతేషు పరమాం గతిమ్
అబ్రవీత్ భారతం లోకే మానుషేస్మిన్ మహానృషిః॥

అని భారత పీఠికయందుఁ జెప్పఁబడియున్నది.

వేదవ్యాసమహర్షి యీభారతసంహితను మొట్టమొదటఁ బ్రధానకథలను మాత్రము 24 వేల శ్లోకములుగ రచించి పిదప వాని కనుకూలము లగుకథ లన్నిటినిఁ గల్పించికొని వాని నన్నంటిని 76 వేల శ్లోకములుగ నంతయు లక్షశ్లోకములుగ రచించినవాఁడు. కొందఱు 60 లక్షలశ్లోకములుగ నీభారతము రచించి యందు 30 లక్షలు దేవ

లోకమునందును, 15 లక్షలు పితృలోకమునందును 14 లక్షలు గంధర్వలోకమునందును నూటయొకలక్ష మనుష్యలోకమునందును వెలయించెనని చెప్పుదురు. మఱియు నాభారతమును నారదుఁడు దేవతలకును, దేవలుఁడు పితృదేవతలకును, శుకాచార్యులు గంధర్వులకును, మనుష్యలోకమునకు వైశంపాయనుఁడును జెప్పిరి. అని భారతపీఠికయందు వ్రాయఁబడియున్నది. దీనింబట్టియే, చరిత్రకారులు రామాయణభారతములు మొట్టమొదట నింత పెద్దవిగా లేవనియు రామాయణ మొక్కదినములోఁ జదువఁదగినదిగా నుండె ననియు, భారత మయిదువేల శ్లోకములుగ నుండెననియు రాను రాను సందర్భానుసారముగ నెవరెవరిచేతనో కొన్ని శ్లోకములు రచింపఁబడి చేర్పఁబడుటచే నిప్పు డున్నంత పెద్దవిగా నేర్పడియె ననియు, నూహించెదరు. ఇది నిజమేని వైగ్రంథములు పలువురచే రచింపఁబడినవి కాన శైలి భిన్నముగ నుండవలయును, భారతరామాయణము లేకవిధ మగుశైలి కలవిగానే యున్నవి. మఱియు గ్రంథములు రచించువారు తమ పేరు ముందుకు రావలయు నని కదా గ్రంథములు రచింతురు. ఒకరు వ్రాసినగ్రంథములఁ జొన్పిన వారి పేరే ముందునకు వచ్చును గాని తమ పేరు ముందునకు వచ్చునా ? దానివలనఁ దమకేమి లాభము. కాన నెవరిచేతనో యింత పెద్దగ్రంథముగఁ జేయఁబడిన దనుటకంటె వ్యాస వాల్మీకాదులే మొట్టమొదటఁ గథనంతను సంగ్రహముగ నొకచిన్న పుస్తకమును వ్రాసి యావలసందర్భోచిత మగువర్ణనాదులఁ జేర్చి యింతవిరివిగ రచించియుండవచ్చునని చెప్పుట మంచిది. మొట్టమొదట రచించిన సంగ్రహకావ్య మెవరికైన దొరకిన వారదే రామాయణము భారత మని తలంచి వ్యవహరించుటచేఁ బైలోకప్రథ కలిగియుండవచ్చు నని తలంచెదను.

పూర్వము చెప్పినట్లు భారతగ్రంథసంఖ్య లక్షశ్లోకము లని యున్నను, నాయాపర్వమునకు నిన్నిశ్లోకము లని చెప్పియుండుటంబట్టి లెక్కవేసి చూడఁ జాల వ్యత్యాసము వచ్చుచున్నది. మఱియు నాంధ్రభారతమునఁ జెప్పిన పర్వశ్లోకసంఖ్యకును సంస్కృతభారతమునఁ జెప్పిన పర్వశ్లోకసంఖ్యకును వ్యత్యాసము కన్పట్టెడి. ఆంధ్రభారతమున నాదిపర్వము తొమ్మిదివేల తొమ్మన్నూట యెనుబదినాల్గుశ్లోకంబులని చెప్పఁబడియున్నది. "సంస్కృతమున ఇత్యేత దాదిపర్వోక్తం ప్రథమం బహువిస్తరం అష్టాశ్లోకసహస్రాణి వ్యష్టౌ శ్లోకశతానిచ । శ్లోకానాం చతురాశీతి ర్మునినోక్తా మహాత్మనా ।। " అని యెనిమిదివేల యెనిమిది నూఱుల యెనుబదినాల్గు శ్లోకము లని చెప్పఁబడియున్నది ఇట్లె ప్రతిపర్వమునకును భేదము కన్పట్టుచున్నది. ఇట్లు భేదము గలుగుటకుఁ దగినకారణము విచారింపవలసియున్నది.

ఇంత గొప్ప గ్రంథము వ్రాయఁబూని వ్యాసమహర్షి ప్రణాళికయంతయును మనస్సున నాలోచించుకొని వ్రాయ సమర్థుఁడగు లేఖకుఁడు దొరకఁడాయెఁగా యని యాలోచించుచు బ్రహ్మనుదలంప, బ్రహ్మ రా నతని కీసమాచారమంతయుఁ జెప్ప నతఁడు నీవు వ్రాయఁబూనిన గ్రంథమును లిఖింప దక్షుఁడగువాఁడు గణపతి యని చెప్ప వ్యాసమహర్షి తలంచుటయే తడవుగ గణేశుఁడు వచ్చి "నేను గంటము నిలుపకుండ వ్రాయునట్లు చెప్పిన వ్రాయఁగలఁగుదు" నని యన "నేను జెప్పిన శ్లోకముల కన్నిఁటికి నీ వర్థముచేసికొని వ్రాయవలయు" నని వ్యాసులు పలుక నట్లేయని గణపతి వ్రాయఁగడఁగె ననియు గణపతి యచ్చటచ్చట నెంతేని యొక శ్లోకమునకు నర్థముచేసికొనుచు నించుక యాలసింప నాలోపల వ్యాసుఁ డెన్నియో శ్లోకముల నాలోచించుకొని గణపతినిఁ దొందరచేయుచుండె ననియు నట్లు చెప్పఁబడినవే వ్యాసఘట్టములని చెప్పఁబడు శ్లోకములనియు నట్టివి 8800 శ్లోకము లున్నవనియుఁ, దక్షిణభారతమును దెనిఁగించునప్పుడు కుమ్మరగురునాథుఁడు లేఖకుఁడుగాఁ గుదిరి యిట్లే పందెమువైచికొని వ్రాయఁబూని తిక్కన యంత వేగముగఁ జెప్పఁజాలక యేమి చెప్పుదుం గురునాథా యని చెప్ప గురునాథుఁడు తన ప్రతిజ్ఞప్రకారము సందర్భమునకుఁ దగిన ట్లర్థముచేసికొని యేమి చెప్పుదుం గురునాథా యని వ్రాసె నను కథవంటి కథను నొక దానిని వ్యాసమహర్షి విషయమున నాంధ్రాక్షరముద్రిత సంస్కృతభారతపీఠికయందుఁ గుండలీకరణచిహ్నితముగ నుండఁ గానవచ్చెడిని. క్రింద లఘుటీక వ్రాయువారును నిది యనేకగ్రంథములయందు లేదని వ్రాసియున్నారు. ఈ కథ కుమ్మరగురునాథుని కథవలెనే యసత్యమని తోఁచెడుఁగాని "పయః పాస్యామి గోవింద గోమయం నతు గోమయం। గోమయే వాగ్నివర్జేన గోమయం నతు గోమయం" ఇవి మొదలగు దుర్ఛేద్యములగు శ్లోకము లుండుటంబట్టి యించుక సందేహింపవలసి యున్నది.

వ్యాసమహర్షి మూఁడుసంవత్సరములు సంతతపరిశ్రమచేసి దినమునకు 95 వంతున లక్షశ్లోకములు గలయీభారతాఖ్యానము వ్రాసినట్లు తెలియుచున్నది.

ఋషిభి ర్బహుధా గీతం ఛందోభి ర్వివిధైః పృథక్ ।
బ్రహ్మసూత్రపదై శ్చాపి హేతుమద్భి ర్వినిశ్చితైః॥

అని భారతమున భగవద్గీతయందుఁ బదుమూఁడవ యధ్యాయమునఁ జెప్పఁబడి యుండుటచే నీభారతము బ్రహ్మసూత్రములకంటె వెనుక రచింపఁబడినట్లు తోఁచెడి. బ్రహ్మసూత్రములు వేదోపబృంహితములు. అందు బౌద్ధాదిమతము లనేకములు సప్రమాణములుగ ఖండింపఁబడినవి. బ్రహ్మసూత్రముల కంటె నీభారతము వెనుక రచింపఁబడి యుండిన వేదోపబృంహితమగు నిందు సూత్రములయందు సూచింపఁబడిన మతముల నించుకైనను సూచించి యుండఁడా ? భారతమునందుఁ గేవలము శుద్ధాద్వైతముమాత్రమే నిరూపించి

యున్నాఁడు గాని విమతముల పేరైనను దలపెట్టలేదు. మఱియు భారతకాలమునాఁటికి శుద్ధాద్వైత మగు హిందూమతము తక్కఁ దక్కినదుర్మతము లేవియు లేనట్లు చరిత్రములు ఘోషించుచున్నవి విమతము లన్నియు బౌద్ధయుగమున క్రీ. పూ. 500 క్రీ. శ. 500 సంవత్సరములనాఁడు పుట్టి ప్రబలి వ్యాపించినట్లు చరిత్రముల వ్రాయఁబడి యున్నది. కాన విమతమత ఖండనరూప మగు బ్రహ్మసూత్రములు మతయుగ మనఁదగిన బౌద్ధయుగమునందు వ్రాయఁబడినవే కాని భారతమునకు ముందు వ్రాయఁబడిన వను వాదము యుక్తియుక్తము కాదని తోఁచుచున్నది పైశ్లోకము ప్రక్షిప్త మనఁదగును.

బ్రహ్మసూత్రములు భారతమునకు ముందు రచింపఁబడినవి కావని నిర్ణయింతు రేని క్రీస్తునకుఁ బూర్వము 30 శతాబ్దములనాఁటి వ్యాసులు బౌద్ధయుగ మధ్యమువఱకు జీవించియుండుట యసంభవము గాన బ్రహ్మసూత్రములు వ్యాసులచే రచింపఁబడినవి కావనియు నా పేరుగల మఱియొకరిచే రచింపఁబడినవనియుఁ జెప్పవలసి వచ్చును. ఈ విషయము బ్రహ్మసూత్రములే సూచించుచున్నవి "తదుపర్యపి బాదరాయణః సంభవాత్" అను సూత్రమునందు బాదరాయణశబ్దముఁ బ్రయోగింపఁబడి యున్నది. బాదరాయణశబ్దమునకు నెల్లయెడలను వ్యాసపరముగానే యర్థముచేయఁబడి యున్నది

శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణం
సూత్రభాష్యకృతౌ వందే భగవంతౌ పునః పునః॥ ౧. ౩. ౨౬.

బాదరాయణుఁడు సూత్రములు వ్రాసెననియు, వానికి శంకరాచార్యులు భాష్యము వ్రాసిరనియు మీఁది శ్లోకమువలనఁ దేర్పడుచున్నది వ్యాసుఁ డొక్కఁడే యైన వ్యాసులే "దేవతలకును బ్రహ్మవిద్యాధికారము గలదని బాదరాయణుఁడు (వ్యాసులు) తలంచుచున్నాఁడు." అని యేల చెప్పును. "మధ్వాదిష్వసంభవాత్ అనధికారం జైమినిః" ౧ ౩ ౩౧ జైమిని వ్యాస శిష్యులలో నొక్కఁడని యెల్లరకుఁ దెలియును గదా తఱచుగ గురుశిష్యు లేకమతస్థులు నేకాభిప్రాయముగలవారుగ నుండుట సంప్రదాయసిద్ధము. పైసూత్రమున బాదరాయణుఁడు దేవతలకును బ్రహ్మవిద్యయం దధికారము గలదని చెప్పనతని శిష్యుఁడు జైమిని యీసూత్రమున నధికారము లేదని చెప్పుట యీజైమిని వ్యాసశిష్యుఁడు కాఁడేమో యని సూచించుచు జైమిన్యాది శిష్యులు గల వ్యాసులు మఱియొకరు గలరనియు, దేవతలకును బ్రహ్మవిద్యయం దధికారము గల దనువ్యాసులు జైమిని గురువు కాఁడనియుఁ దెల్లమగుచున్నది చక్కఁగఁ బర్యాలోచన చేసిన వ్యాసులు ముగ్గు రున్నట్లును, అందొకరు బ్రహ్మసూత్రములు రచించి రనియు, నొకరు జైమిన్యాదులగురువు భారతము రచించి రనియు, మఱియొకరు గ్రంథముల నేనిని రచింపకపోయినను వేత్తయై ప్రామాణికుఁ డని గ్రహింపఁదగినవాఁడు నుండె ననియు

స్పష్టముగ నూహింపఁదగి యున్నది. పై హేతువులవలన బ్రహ్మసూత్రములకు నీవ్యాస కర్తృత్వము నిరాకరింపఁబడియె.

వ్యాసు లిరువురే కాక పదునెనమండ్రుగు రున్నట్లు యోగవాసిష్ఠమున నున్నదని కొందఱు పండితులు చెప్పుచున్నారు ఆగ్రంథము నాకు లభింపలేదు చూచినం గాని నిర్ధరింపఁజాలను. వ్యాసపద మధికారనామముగాని ప్రాణినామము గాదనియు నెవ రెవ రాపదవికి వచ్చెదరో వారికందఱకును వ్యాసులని నామము గలదయి కలెక్టర్లెందఱో మాఱినను నందఱకును కలెక్టరను పేరు సామాన్యముగ నున్నట్లని కొందఱు చెప్పెదరు. పదునెనమండ్రుగురున్న వారందఱొక్కపనినే చేయుదురు గదా? భిన్నవిషయములఁ గలపనులఁ బదునెనిమిదింటిని జేసి యుండవలయును. అవి యేవి? ఎన్నిమాఱులు లెక్కపెట్టినను భారతము, బ్రహ్మసూత్రములు, వేదవిభాగము నీమూఁడుపనులే కానిపించుచున్నవి. ఒకయధికారి యూరక రాఁడు గదా! నిష్ప్రయోజనముగ నొకని కొక యధికార మీయరు గాదే ఒకరు చేసినపనినే మఱియొకరు చేయుటచేఁ గలుగు లాభమేమి? కాన నిదియు సమంజసముగా నుండలేదు

ఒకటి యొప్పుకొన్నం గాని మనసంశయము లన్నియుఁ దీరవు.

"అశ్వత్థామా బలి ర్వ్యాసో హనూమాంశ్చ విభీషణః।
కృపః పరశురామశ్చ సప్తైతే స్థిరజీవినః॥

అనురీతి వ్యాసులకు స్థిరజీవిత్వ మొప్పుకొనిన నొకవ్యాసులే వేదవిభాగము చేసెననియు, నాయనయే వేదార్థోపబృంహిత మగు భారతాఖ్యానము రచించెననియు, నాయనయే దుర్మతనిరాకరణ మొనర్చు సూత్రముల రచించెననియుఁ, జెప్పవచ్చును. నవనాగరకులు దాని నొప్పుకొనక యూరక శాఖోపశాఖలుగఁ బుంఖానుపుంఖములుగ నూహాపోహ లొనర్చెదరు. వ్యాసుని విషయమై యింకను జర్చింపవలసినవిషయము లనేకము లున్నవి. వానినిఁ బరిశీలించువఱకు నీతని విషయమై యిదమిత్థమ్మని నిర్ణయింప వలను పడదు. కాని ప్రకృతము దొరకిన యాధారములనుబట్టి బ్రహ్మసూత్రములకంటె ముందే భారతము రచింపఁబడియె ననియు, బ్రహ్మసూత్రములను రచించిన వ్యాసులకంటెను భారతమును రచించిన వ్యాసమహర్షి భిన్నుఁడనియు నూహింపవలసి యున్నది.

ఈభారతమునందలి కథ పాండవకౌరవయుద్ధమైనను మనుష్యులకు వలయు ధర్మములు, నీతులు, మతాచారములు, దైవభక్తి మొదలగు విషయములన్నియు వచ్చునట్లు కథ కల్పింపఁబడినది. కథాకల్పనయందు దీనిమించిన గ్రంథము మన హిందూదేశమున మఱియొకటి లేదని చెప్పవచ్చును. ఇందలి కథాకల్పన దేశకాలములకు ననుగుణంబై సర్వదేశములయందును సర్వకాలములయందును ననుసరణీయంబై యనుష్ఠేయంబై

యున్నది. ఈగ్రంథమునందుఁ బ్రతిపాదింపఁబడు ప్రతివిషయము వినువారియొక్కయుఁ జదువువారియు హృదయముల నాటి యేనాఁటికిని మఱచిపోకుండ నుండులాగునఁ జక్కని యుపకథలతో బోధింపఁబడియున్నది. ఉదాహరణపూర్వకముగఁ జెప్పఁబడినకథయే యేనాఁటికిని మఱపునకు రాకయుండునుగదా! మనదేశమునకు వన్నె దెచ్చినది యీ యొక్కగ్రంథమే. ఇందలికథయే సర్వజనాహ్లాదకం బయి యెల్లరను జిత్రప్రతిమలం గావించెడి. ఈకథాసన్నివేశమునకుమున్ దేయుక్తులు, నేవర్ణనలును, పదలాలిత్యము, నలంకారములుఁ బనికిరావు కదయే క్రొత్తక్రొత్తదవుగారుచుండెడి. కావుననే వర్ణనాదుల సారస్య మెఱుంగని పామరులకుఁగూడ నీగ్రంథము హృదయంగమమై యొప్పారెడిని. అన్నిరసములకును, నన్నిరీతులకును, నన్నివృత్తులకును, మనుష్యులకు గలయు నన్నివిషయములకును ననువగు సందర్భము వచ్చునట్లు కథ కల్పించుట యెంతయు శ్లాఘ్యము కావ్యమునకిదియే యుండవలయు ననినాయభిప్రాయము. ఇతరకావ్యంబుల యందు వర్ణనావైదగ్ధ్యంబునను, అలంకారచాకచక్యమువలనను రుచిపుట్టవలయునే కాని కథాచమత్కారమువలన రుచి పుట్టుటలేదు కథయంతయుఁ గట్టె, కొట్టె, తెచ్చెనను మూఁడుమాటలలో నిమిడియుండును. వసుచరిత్రమొదలగు ప్రబంధములయందు నొక శృంగార రసమునకుఁ దప్ప మఱి యేరసములకు నైనను సందర్భమున్నదియేమో యోజింపుఁడు ?

ఈవ్యాసమహర్షి యెంతరసవంతముగ నీభారతమును రచించెనో యంతకంటెఁ బరి మధురముగ నన్నయభట్టు తిక్కన యెఱ్ఱాప్రెగ్గడ యనుముగ్గురు కవులు దీనిని తెనిఁగించిరి. వ్యాసకృతభారతము సంస్కృతకావ్యములలో నెల్ల నగ్రగణ్యమయినట్లు నన్నయాదుల యాంధ్రభారతమును నాంధ్రకావ్యములలో నుత్తమోత్తమమయి సాగరకత కర్ణతాంబూలముఁ గైకొనుచున్నది సర్వవిధముల వ్యాసభారతమునకు నీయాంధ్రభారతము ప్రతిబింబముగ నున్నది. సర్వవిషయములలోను నీయాంధ్రభారతము సంస్కృతభారతముం బోలి యున్నదనుటకు నెట్టి సందేహమును లేదు.

భారతములోని ప్రతిపాత్రముచర్యయు నెంతయు నీతిబోధకమయి యున్నది. ముఖ్యపాత్రమగుదుర్యోధనునిచర్య " పరులధనమునకు విద్యా! పరిణతికిం దేజమునకు బలమునకుసునం బెరయఁగ నసహ్యపడుచున్న దుఃఖము తెవులులేనివేదనంబడు నధిపా " అను నర్థమునుబాహ్యముగ బోధించుటయేకాక సజ్జనతిరస్కారము, దుర్జనసహవాసము, పరదార పరధనాపహరణేచ్ఛ యెంతవారికైనను ముప్పును గలిగించునని ఘంటాఘోషముగ నుద్ఘోషించుచున్నది.

ధర్మరాజాదుల నడవడి "చెల్లియుండియు సైరణ సేయునతఁడుఁ, బేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ। దనకుఁ గలభంగి నిచ్చునతండుఁ బుణ్య। పురుషులని చెప్పి రార్యులు గురువరేణ్య" అనునర్థమునకుఁ బ్రథమోదాహరణముగ నుండుటయేకాక తామెంతవారైనను ధర్మపాశబద్ధులగుట లగ్గనియు, సమయాసమయములు గుర్తెఱిఁగి తమప్రతాపశౌర్యాదుల వెలిపుచ్చ నగునుగాని యసమయముల వెలిపుచ్చరాదనియుఁ దమకు మంచిసమయము వచ్చువఱకు వేగిరపడక పరమశాంతత వహించి వేచియుండుటయే తగుననియు సమయోచితముగ మెలఁగుటయే పురుషధర్మమనియు దేశకాలముల ననుసరించి తమవృత్తిని మార్చుకొనవలయు ననియుఁ దెలివిడి చేయుచున్నది.

ప్రపంచాతీతుఁడును, రాగద్వేషాది శూన్యుఁడును, విధిప్రతిషేధరహితుఁడును, సర్వక్రియాశూన్యుఁడును నగు కృష్ణునిచర్య తన కెంత వైరాగ్యమున్నను, జ్ఞానమున్నను, నెంత వేదాంతియయినను, దనకు దేనితోఁ బనిలేకున్నను, లాభనష్టములతో నక్కఱ లేకపోయినను, నితరులకు మేలున్న నా కార్యమును దనశక్తికొలఁదిఁ బనిచేసి సాధించి లోకోపకార మొనరించుట ముఖ్యకృత్యమనియు, నుత్తము లగువారు తమ కేమని యూరకున్న లోక ముచ్ఛేద మగుననియుఁ, గాన ధర్మపక్ష మవలంబించి యధర్మపరుల నిర్మూలముఁ గావించి సజ్జనరక్షణము చేయుట ముఖ్యమనియు బోధించుచున్నది.

భీష్మునిచర్య, మాతాపితృభక్తి మనుష్యునకు ముఖ్యకృత్యమని బోధించుటయే గాక వైయర్థ్యమును గూడ వివరించుచున్నది. ఇట్లే యొక్కొకపాత్ర యొక్కొకనీతిని బోధించుచున్నది. భారతమున నిరర్థకముగఁ దేఁబడినదియు దుర్నీతిబోధక మయినదియు నగుపాత్ర యొక్కటియును లేదు

యుత్పత్తిచెప్పఁదలఁచి సౌప్తికవధకధ నుపక్రమించినంతమాత్రమున సౌప్తికవధాంతమే వ్యాసకృతభారతమనుట యసంగతము. హరివంశమునఁ గృష్ణకథ సమగ్రముగా వర్ణింపఁబడినందున భాగవతము పురాణమే కాదనుట యుక్తమా? ఇతిహాసపురాణములందుఁ బసక్తానుప్రసక్తిచే నితరపురాణగాథలఁగొన్నిటి వదలుటయుఁ గొన్నిటిస్వీకరించుటయుఁ బురాణావలోకనము చేయువారలకుఁ దెలియనియంశముకాదు. భారతమును గల్పవృక్షముగా నిరూపించినయాదిపర్వప్రథమాధ్యాయగతశ్లోకములలో "సంగ్రహాధ్యాయబీజో వై పౌలోమాస్తీకమూలవాన్ సంభవస్కంధవిస్తార స్సభారణ్యవిటంకవాన్ అరణీపర్వరూపాఢ్యో విరాటోద్యోగసారవాన్, భీష్మపర్వమహాశాఖో ద్రోణపర్వపలాశవాన్ కర్ణపర్వసితైః పుష్పై శ్శల్యపర్వసుగంధిభిః స్త్రీపర్వైషీక విశ్రామ శ్శాంతిపర్వమహాఫలః అశ్వమేధామృతరస స్త్వాశ్రమస్థానసంశ్రయః మౌసలశ్శ్రుతిసంక్షేప శ్శిష్టద్విజనిషేవితః సర్వేషాం కవిముఖ్యానాముపజీవ్యో భవిష్యతి" యని భారతము స్వర్గారోహణపర్వాంతమని చెప్పఁబడియుండఁగా ధర్మజుఁడశ్వమేధము నే చేయలేదనియు వ్యాసమహర్షియార్త్విజ్యమే చేయలేదనియుఁ జెప్పసాహసించుట విచిత్రముగానున్నది. ధర్మజుఁ డశ్వమేధము చేయలేదని చెప్పెడి శ్రుతికనఁబడునంతవఱకు ధర్మజుఁడశ్వమేధమాచరించెనని చెప్పెడి భారతస్మృతివచనమప్రమాణము కానేరదు. "విరోధే త్వనపేక్షం స్యా దసతిహ్యానుమానం" అను మీమాంసాన్యాయము శ్రుతిస్మృతులకుఁ బరస్పరవిరోధము కలిగినప్పుడు స్మృతికంటె శ్రుతియే ప్రమాణమనియు శ్రుత్యంతరవిరోధము లేనియెడల స్మృతి ప్రమాణమనియుఁ జెప్పుచున్నది. వ్యాసమహర్షి రాజసూయాధ్వరమున బ్రహ్మత్వము చేసినట్లు సభాపర్వము ౩౩ అ, న శ్లో॥ స్వయం బ్రహ్మత్వమకరో త్తస్య సత్యవతీసుతః ధనంజయానామృషభ స్సుసామా సామగోభవత్॥ యాజ్ఞవల్క్య

బభూవాధ బ్రహ్మిష్ఠోధ్వర్యుస్సత్తమః పైలో హోతా వసోః పుత్రో ధౌమ్యేనసహితో௨భవత్॥ వ్యాసమహర్షి బ్రహ్మత్వము చేసెను. యాజ్ఞవల్క్యుఁడాధ్వర్యము చేసెను. సుసాముఁడౌద్గాత్రమును పైలధౌమ్యులు హౌత్రముఁ జేసిరని చెప్పఁబడెను. సకలలోకమహనీయులు సన్నిహితులగు రాజసూయమహాక్రతువునందు బ్రహ్మత్వమాచరించిన వ్యాసమహర్షి శిష్టసమ్మతుఁడు కాఁడని వ్రాయుట హాస్యాస్పదము. ఋత్విక్కులలో బ్రహ్మయే సర్వాధికుఁడని శ్రౌతిసంప్రతిపన్నము. అశ్వమేధపర్వము అ ౭౨ వ్యాసఉవాచ ॥ శ్లో॥ అహం పైలోథ కౌంతేయ యాజ్ఞవల్క్యస్తథైవచ। విధానం యద్యథాకాలం తత్కర్తారో నసంశయః॥ అని రాజసూయయాగఋత్విక్కులే యశ్వమేధమున కార్త్విజ్యము చేసినట్లు వర్ణింపఁబడినది. "కృష్ణద్వైపాయనాదయో యే ఋషయః "అని ఋషితర్పణమునఁ బ్రథమోత్కీర్తితుఁడగు వ్యాసమహర్షిని నిషాదవ్యాసుఁడని దూషించుట కడుశోచనీయము. " అపాంతరతమానామ వేదాచార్యః పురాణఋషిః విష్ణునియోగాత్ కలిద్వాపరయోస్సంధౌ కృష్ణద్వైపాయనస్సంబభూవ " అని యాధికారికాధికరణమున శ్రీశంకరభగవత్పాదాచార్యులు కలిద్వాపరసంధి నవతరించిన కృష్ణద్వైపాయనుఁడు వేదాచార్యుఁడని చెప్పియున్నారు. ఇట్టి ప్రమాణములకు విరుద్ధముగా వ్రాసిన వీరి వ్రాఁత సరియగునది కాదు. శ్రీకృష్ణుడు మృతులగు పుత్రులను దేవకీవసుదేవులకును దమగురువునకును గనఁబఱచెను. అటులనే వ్యాసమహర్షి భారతయుద్ధమృతవీరులను ధృతరాష్ట్రాదులకుఁ గనఁబఱచెను. యుద్ధమృతుల భార్యలకు భర్తృసాలోక్యమిచ్చెను. ఇట్టి పవిత్రకథను "భరణములీయవలసివచ్చునని ధర్మజునకు మేలుచేయఁదలఁచి యిందఱుస్త్రీలను, మాయోపాయము చేఁజంపె" నని వ్రాయుట పాపకార్యము. వ్యాసమహర్షిని గాంధారీధృతరాష్ట్రాదులు తమతమ సంబంధులగు మృతవీరులఁ జూపింపుమని ప్రార్థించిరి. తపః

పరిభావమున లోకాంతరముల సృజించుటకుఁగూడ సమర్థుఁడగు వ్యాస మహర్షి దుఃఖితులగు ధృతరాష్ట్రాదులకు రాత్రియందు భాగీరథిలో యుద్ధమృతులఁజూపించెను. వారందఱుఁ దెల్లవారువఱకుఁ దమబంధువులతోఁ గలసిమెలసి సంభాషించి వారి నాలింగనముచేసికొని వారితో వెళ్ళవచ్చెదమని చెప్పి మరల భాగీరథిలో మునింగి తమతమలోకములకుఁ బోయిరి. ధృతరాష్ట్రునకు దివ్యచక్షుస్సునీయఁగా నాయనగూడ నీయద్భుతములంజూచెను. అపుడు పతిలోకము కావలసిన స్త్రీలకు భాగీరథిలో నవగాహనముచేయుఁడు, భర్తృసాలోక్యమువచ్చునని వ్యాస మహర్షియాజ్ఞనొసంగెను. అపుడు వారివాక్యములందు శ్రద్ధగల పతివతిలు ధృతరాష్ట్రుని యనుజ్ఞగైకొని గంగాప్రవేశముచేసి దివ్యమాల్యాంబర ధారిణులై పతిసాలోక్యమును బొందిరి. అని యాశ్రమవాసపర్వమున వర్ణింపఁబడినది. ఈవిధానము ధర్మజునకు భరణము తప్పించుటకు రచించిన సినీమావిధానమైనయెడల వారు పరస్పరము మాటలాడుకొనుటయుఁ దమబంధువులవద్దకువచ్చి వారి నాలింగనము చేసికొనుటయు మొదలగు నద్భుతము లెట్లుఘటించును ? ఆశ్రమవాస పర్వము, అధ్యాయము 33 శ్లో॥ పరస్పరం సమాగమ్య యోధానాం భరతర్షభ । సమాగతాస్తాః పితృభిః భ్రాతృభిః పతిభిస్సుతైః । ముదం పరమికాం ప్రాప్య నార్యోదుఃఖమథాత్యజన్ । ఏకాంరాత్రిం విహృత్యైవ తేవీరా స్తాశ్చ యోషితః । ఆమంత్ర్యాన్యోన్యమాశ్లిష్య తతో జగ్ము ర్యథాగతం ॥ ఇత్యాది శ్లోకము లీయర్థమును జెప్పును. ఆసమయమున " అమ్మలారా ! అక్కలారా ! మీరు మోసపోకుఁడుమీకు ధర్మజుఁడు భరణములీయవలసివచ్చునని వ్యాసుఁడు ధర్మజునియందలిప్రేమచే మిమ్ము మోసముచేయుచున్నాఁడు. బ్రతికియుండిన బలుసాకైన నేఱుకొనితినవచ్చును. లేదా వ్యాసునితల్లి యిద్దఱిని గట్టుకొనలేదా ? కుంతి నలుగురితో వ్యభిచరించలేదా ? ద్రౌపది యైదుగురిని వివాహ

చూడలేదా ? కలియుగమున నింకెందఱో యవతారపురుషులు వితంతు
వివాహములఁ జేయింపనున్నారు. మీరును బునర్వివాహములఁ జేసికొనుఁ
డు. ధర్మజుఁడు భరణమీయక పోయినను సరే. స్వైరిణులై కామసుఖమనుభ
వింపుఁడు" అని హితము బోధించెడి యీశాస్త్రులుగారివంటి యాప్తుఁ
డొక్కఁడేని ఘటించనందున నింతటి యకార్యము జరిగియుండెనని గ్రహిం
పవలెఁగాఁబోలు - తుదకు ధృతరాష్ట్రుఁడైనను "అమ్మలారా ! బ్రతికి
యైనను యుండుఁడని కోడండ్రను బ్రేమించక పోయెను - గంగాప్రవేశము
చేయుఁడని యాజ్ఞయొసంగెను. యుద్ధానంతరము పదునైదు సంవత్సర
ములు భరణమిచ్చిన ధర్మజుఁ డీకఁ గొంతకాల మీయలేఁడా ? సరి
సరి. ఇట్టి కల్పనలు ప్రాజ్ఞులకు లజ్జావహములు. ఆయన వీరనుకొని
నటుల మోసమే చేసిన యెడల నీనిజము గ్రహించిన దయాళువులు
మహర్షులలో నెక్కఁడైన నుండరా? వారు నిజము తెలిపియుండరా ?
ఏపురాణమందుఁగాని శాస్త్రమందుఁగాని వ్యాసమహర్షి పవిత్రతా
విషయమై సంశయించు వాక్యములు గనుపించవు. పౌరాణికులందఱు
నేఁటివఱకు, శ్లో॥ వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేఃపౌత్ర మకల్మషం ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం॥ అని వ్యాసమహర్షి
యకల్మషుఁడనియుఁ దపోనిధియనియు నంగీకరించుచున్నారు. వీరను
కొనినప్రకారము చూచినను పాండవధార్తరాష్ట్రులు తనసంతతిలోని
వారు. ధార్తరాష్ట్రులును బ్రకృతివిరుద్ధజన్మముకలవారలే. ఈసంగతి
యిదివఱకు నిరూపించియున్నాను. ఇటులుండఁగా ధర్మజునకే యిట్టి
యుపకారము చేయఁదలంపనేల ? ప్రకృతివిరుద్ధజన్మముకలవారు కాని
ప్రకృతివిరుద్ధజాతుల కుపకరించరని నియమ మంగీకరించునెడల నిమ్న
జాత్యుద్ధరణమునకుఁ బాటువడెడి నవనాగరిక బ్రాహ్మణులు నిమ్నజాతి
పాజాత్యముకలవారనియనుట భావ్యమా ? అటులనుట యుక్తము
[illegible] సకలసనాతనధర్మప్రతిపాదకమై వేద

తు ల్యమని శ్లాఘింపఁబడు మహాభాగతనిబంధనము రచించిన కృపా
ధిక న్యాసమహర్షి యనాధస్త్రీసహాసములు నన్యాయముగా
వధించిన దూఱుట యెంతయుచితమో పాఠకులే గ్రహింతురుగాక.
విశ్వరూపప్రదర్శనము చేసిన శ్రీకృష్ణుని దర్శోధనుఁ డైన్ద్రజాలికుఁ
డనెను మృతవీరులఁగన బఱచిన వ్యాసమహర్షిని పిసీమాపాదర్శకుఁ
డని యీశాస్త్రులుగారనిరి. భారతోత్తమ చరితము సామాన్యబుద్ధితో
విమర్శించనయెడల ఫల మిట్టిదే కలుగును. శ్లో॥ కంబూక స్సికతిల
భూతలానుక్రీ సంవింతే పర మురసా పదాని గచ్ఛన్। ద్విగ్రాణి
క్షుభితమహార్ణవ స్తిమాంద్రః కూలే ద్వేచరంతి మృషేతి లోకవార్తాం॥
గవ్వపురుగు ప్రతిదినము రెండుమూఁడడుగులు నడుచును తనశక్తిని
బట్టి గిమి గిలము సముద్రమునుఁ బ్రబలిన ను నేకయోజనములు తిరుగు
న. కద. మ్మన మనియెందమనన నభియుక్తోక్తి యింక నుదాహరణ
ముగానున్నది గురుదేవతాభక్తివిరహితమగు నకాలమున గురుదేవ
తాభక్తిప్రోత్సాహమునకు బదులుగా గురుదేవతాభక్తివినాశకములగు
నిట్టివిమర్శనములు బయలువెడలుటకలికాలవిలాసము శ్లో॥ యుధిష్ఠిరో
ధర్మమయో మహాద్రుమః ॥ ధర్మోభివర్ధతియుధిష్ఠిరకీర్తనేన। పాపం
ప్రణశ్యతి వృకోదరకీర్తనేన। శత్రు ప్రణశ్యతి ధనంజయకీర్తనేన।
మాద్రీసుతౌ కథయతాం నభవంతిరోగాః॥ అను పురాణోక్తిప్రకారము
కీర్తనమాత్రమున నకలశుభంబుల నొనఁగూర్పఁదగిన పాండవులను
లోకాచార్యుఁడగు వ్యాసమహర్షిని స్వేచ్ఛానుసారము తూలనాడిన
యీశాస్త్రులుగారియపచారముల క్షమించి వరికాయురారోగ్యైశ్వర్య
ముల నిచ్చుటకును నిట్టివిమర్శనముల వ్రాయకుండ వీరియంత

రాత్మను బురికొల్పుటకును సర్వశక్తులుగల యజ్ఞేశ్వరుని ప్రార్థించు చున్నాను. వీరవ్రాసినపత్రికావిషయమునకు సమాధానము వ్రాయుట యనవసరమని దిజ్మాత్రము గనంబఱచితిని. ప్రాజ్ఞు లీ స్థాలీపులాకన్యాయముచే నిజము గ్రహింతురుగాక !

మల్లాది రామకృష్ణశాస్త్రి చయనులు,
అమరావతి,
గుంటూరు జిల్లా

చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు.

—• రాక్షసులు భుజించు శ్రాద్ధములు •—

వ॥ అనియిట్లు ప్రస్తాత పలుకుటయు రాక్షసరూపుఁడగు విశ్వావసుం గని బ్రహ్మ యిట్లనియె. ౨౧౦

కం॥ "నీ వీరూపముతోడన దేవాత్మా! నేను సెలవునొసఁగెడిదాఁకన్
పావనము చమత్కారపురీ వరుణదిశ న్వసింపు. ప్రియము గాఁ గంతన్. ౨౧౧

ఆ॥ లంకనుండివచ్చి లక్షోపలక్షల యసురు లచటఁ దపము నాచరించు
చున్నవారు కోరి యున్నతపద. మట రాజవగుచు నాగర ప్రియముగ. ౨౧౨

కం॥ భూతప్రేతపిశాచము లాతత కూశ్మాండములును నతిదుర్మార్గో
పేతులగు దనుజులును గల రేతత్క్షేత్రంబునందు నింకను దనయా! ౨౧౩

ఆ॥ అచటికరుగునట్టి యవనీప్రజల వారు నిగ్రహింతు రదియె నిమిషమునను
నెదుట నాగరుఁడు సమీక్షింపఁబడినచో భయముఁజెంది దవ్వు పాఱుచుండ్రు.

తే॥ అట్లుగావున నచ్చటి యఖిలదానవులకు నేలికవగు పొమ్ము పుత్ర! నీవు.
ఇపుడె రాక్షసరాజ్యంబు నేను నీకు నిచ్చినాఁడను బేర్మిమై నేలుమనుచు" ౨౧౪

వ॥ అనియిట్లు చెప్పుటయు రాక్షసుండిట్లనియె. ౨౧౫

ఆ॥ "అసురవరులమీఁద నాధిపత్యంబును బొందు నాకు నేది భోజ్యమచట?
భృత్యతతికి నేమి పెట్టంగవలయును? కరుణయుంచి చెప్పఁగదె సురేశ! ౨౧౬

కం॥ ఏరాజు భృత్యజనులను గూరిమిఁ బోషింపకుండు ఘోరతరంబౌ
రౌరవనరకమునంబడు నారాజని విన్నవాఁడ నార్యులవలనన్" ౨౧౭

వ॥ అనియిట్లు వక్కాణించుటయుఁ జతురాననుండు ౨౧౮

కం॥ "తిలదర్భహిరణ్యములం గలితముగానట్టి శ్రాద్ధకర్మము తీర్థం
బులఁ బెట్టఁబడినదైనను బలిమిని నీకొసఁగినాఁడ బాలక! కొనుమా. ౨౨౦

సీ॥ కంపలవెంబడిగల యశుద్ధమునీని బలిసియుఁడిన యూరఁబందిగాని
పశుచర్మకృతములౌ పాదరక్షలుదెచ్చి కొలుకు చిల్లులుగాలు కుక్కగాని
బూడిదలంబడి పొరలుచుఁ గడుఁ గఠోరంబుగాఁ గూయు గార్ధభముగాని
ప్రసవా ర్తవార్ధ్రవస్త్రచ్ఛన్న మృదుతనూకల్గియె యున్న పుష్పవతిగాని
చూచుచుండంగఁబెట్టెడి క్షోణిసురుల శ్రాద్ధములఁ బోయి నీవు సమృద్ధముగను
గుడుచుచుండుమి యవ్వార లిడుపదార్థములను భృత్యయుతంబుగం బుత్ర! యెపుడు.

తే॥ ద్వాదశాంగుళములుగూడ దాఁటిపోయి మూలరహితంబులైనట్టి మూరెఁడేసి
దర్భలంజేర్చి విధిరహితముగ నెట్లొ పెట్టుశ్రాద్ధంబులన్నియు బిడ్డ! నీవి. ౨౨౨

ఆ॥ తిలలొ యవలొ తైలకలితంబులౌ నపూపములొ లేక పెట్టఁబడెడి శ్రాద్ధ
ములను బోయి నీవు లవి భుజియింపుమీ యిచ్చినాఁడ వానినెల్ల నీకు. ౨౨౩

ఆ॥ తలఁదువ్వుకొనియు తానంబుసేయకో ధవళవైనయుత్తరీయముఁగ [illegible]
పెట్టఁబడినయట్టి పితృకర్మ మంతయు నిష్ఫలంబు [illegible] కుమార! ౭౨౪

సీ॥ వ్యభిచార మొనరించు నంగన సేవిమిటె యొడలెల్లఁ దెల్లని [illegible]
ప్రప్పిగోళులతోడఁ బొక్కడియాతండు గుహ్యాయు [illegible]
తస్కరత్వమునఁ దలపడినట్టిండు బహుళక్తి [illegible]
డంగలోపంబున నంగలార్చెడివాఁడు [illegible]
కోఁతివన్నె పండ్లయాతండు నశ్నుఁడు [illegible]
సేయువాఁడు వచ్చి యేయాబ్దికంబునఁ [illegible] ! సీస. ౭౨౫

తే॥ ఏముఖంబున దక్షిణ యీయఁబడదొ, యెద్ది [illegible], నెనటు బ్రహ్మ
చర్య మాచరితము గాదు చక్కఁగాను [illegible] ! ౭౨౬

ఆ॥ శ్రాద్ధ వైశ్వదేవ సత్తంతువులయం దతిథి [illegible]
బడకయున్న యెడలఁ దడయక యవియెల్ల నిష్ఫలము [illegible]. ౭౨౭

ఆ॥ శ్రాద్ధమాచరింప సంకల్పమొనరించి కర్త [illegible]
మౌనముూనకుండ మాటాడఁ గడఁగుచో [illegible] ! ౭౨౮

ఆ॥ భిన్నపాత్రములనొ మన్ననం గావింపఁ బడిన [illegible]
నాదికంబొనర్చు నా శ్రాద్ధముం గూడ నిచ్చి [illegible] ! సీస. ౭౨౯

సీ॥ యచ్ఛాద్ధకృద్భోక్త లాదినంబున బ్రహ్మ [illegible]
యచ్ఛాద్ధకర్మమం దెంతయు విక్కృతము [illegible] నుష్టు
యచ్ఛాద్ధమందలి యర్చనమంతయు [illegible]
యచ్ఛాద్ధమందున నాయసపాత్రల భోజనం [illegible]
గ్రహణసంక్రమణేతర కాలములను [illegible]
నెద్ది మంత్రక్రియాహీన, మెది త్రిపాత్రరహిత మా శ్రాద్ధ [illegible] రక్కసులవి"

—♦ యజ్ఞవాటికి [illegible] ♦—

వ॥ అనిపలుకుటయు నవ్విశ్వావసువు [illegible]. నంత నైదవ దినంబున ఋత్విజులందఱు [illegible] పుత్రులై సదోమధ్యంబునం బ్రవేశించి పులస్త్యబోధనుండి [illegible] లుచ్చరించుచును నుండుటయు యజ్ఞాంశలాలసులగు [illegible] నరుదేర నుద్గాత సామగానసూచ్యమాన [illegible] నుపక్రమించి సప్తాక్షరంబులొనరించె. నట్లు సురలు [illegible] ముపక్రమించుడు [illegible] చిత్రంబును [illegible] సంఖ్యావతి

యు ఛందోగుఁడగు దేవశర్మసమభిధాను సంతానమును నగు నౌదుంబరియను కన్యక యరుదెంచి యుద్గాతి నుద్దేశించి ౨౩౧

— ఔదుంబర్యుద్గాతృసంవాదము —

ఆ॥ "సాహసూచ్యమాన శిరసిప్రవర్తన మెట్టులెట్టులగునొ యట్టుపోయి
దక్షిణాగ్నిఁ ద్రేల్పఁ దాన నిహతంబు వాయు, లేకయున్న వ్యర్థమిద్ది" ౨౩౨

వ॥ అని సాభిప్రాయంబుగా ననిన విని యా యుద్గాతి తదుక్తార్థంబు నాలోచించి యాశ్చర్యపడుచు నక్కన్యకతో నిట్లనియె. ౨౩౩

కం॥ "ఎవ్వోటికి నీవిపు డెవ్వోటికి వచ్చితమ్మ యిభయానరో! యే
సచ్చరితు ననుఁగుబిడ్డవు? పొచ్చెములేకుండఁ జెప్పి పోఁగదఁగఁబడుమా" ౨౩౪

వ॥ అనిన నట్లనుగుకుమారి నౌదుంబరి ౨౩౫

తే॥ "ఒక్క గంధర్వి తనయనై యుండ నేను శాపవశమున నిటు దేవశర్మయనెడి
బ్రాహ్మణుని పుత్త్రికగ బుట్టితి సంయమీంద్ర! విహిత పూర్వభవజ్ఞాన సహితనగుచు" ౨౩౬

వ॥ అనవుడు నుద్గాతి యిట్లనియె. ౨౩౭

కం॥ "ఏగంధర్వునికూతురవు? వేమునిగంధుఁడు శపించె నిటువంటి నినుఁ!
బోగాయె. మానవత్వాగం బెపుడౌ ననీకుఁ దనయా! చెపుమా" ౨౩౮

వ॥ నావుడు నౌదుంబరి ౨౩౯

కం॥ "నారదుఁడు సర్వజ్ఞుండను పేరుల గంధర్వవరులు విదితులె కద! య
వ్వారలలోపలఁ బర్వతు గారాబపుబిడ్డ నేను గాశ్యప్యవరా! ౨౪౦

ఉ॥ నారదుఁ డొక్కనాఁడు తన నాకౌప్రవీణయ తానధింగపా
తీరున మీటుచు పాడుచు తీరు లెంచఁగ నిదానమయ్యె నే
నారతి నవ్వుచుండ ననుఁజూచి యతండు "మనుష్యధర్మముఁ
గూరి హసించినందులకు గోల! మనుష్యవుగమ్ము పొమ్మనెన్. ౨౪౧

ఉ॥ "మానవభావమొందినను బ్రాహ్మణవంశమునన్ జనించి సు
స్థానమునందు దక్షిణపు హవ్యము సేయుమటు ల్వీథింపు"మం
చేనును నాదుతండ్రియును వేఁడఁగ నాదుమార్గ ఖ్యముఁ
దాను క్షమించి యిట్లనియెఁ దన్ముని శాపవిమోచకంబుగన్. ౨౪౨

తే॥ "శ్రీమహత్తరపుణ్యక్షేత్రమున రేగ్రుఁడు కులీనుఁడు వేదవేదాంగవిదుఁడు
నై చెలంగెడి దేవశర్మాఖ్యు గృహిణి సత్యభామాఖ్య కడుపున జననమంది ౨౪౩

ఆ॥ ఎపుడు బ్రహ్మదేవుఁ డీక్షేత్రమున యజ్ఞమాచరించు నపుడుపోయి
యూరకుండక నటదుద్గాతి శిరమునిపర్యయంబు గాంచి భయముదక్క ౨౪౪

ఉ॥ "స్థానముగాని స్థానమున శంభువునుంచితి" వంచు దేవతా
మానవవిశిష్టమా సమితిమధ్యమునం దను. శాపమోచనం
బా వపుడే" యటంచుఁ గలహాశనుఁ డిట్లువచించె మామకం
బైన యమర్త్యమూర్తిఁ బితయున్న విమానముఁ జూడు మియ్యెడన్. ౨౪౫

వ॥ అని వక్కాణించుటయు మరల నుద్గాతయిట్లనియె. ౨౪౬

ఉ॥ "తుష్టుఁడనైతి నీవలనఁ దోయజనేత్ర! మదీయదర్శనం
బిష్టద. యట్లుగాన వరమిచ్చెదఁ గోరుము. భూతలస్థులౌ
దుష్టులె నాదుదృష్టిఁబడి తోషితులయ్యెద. రీవు దేవతా
విష్టపజాత. వెంతయును వేడుకనేయఁగనౌను నీకిఁకన్" ౨౪౭

వ॥ అనవుడు నౌదుంబరి ౨౪౮

శా॥ "ఆనందంబునుబొంది నాకు వరమీయం గల్గుచో విప్ర! యిం
కా నేజన్మమునందు నేనియు మదీయార్చన్ సదోమధ్యమ
స్థానంబందున నిల్పి దానియెడలన్ శంభు ప్రచారంబు నెం
తేనిం జేయఁగనౌను స్వర్గగతనా నేఁబ్రీతయై చాడ్పునన్" ౨౪౯

వ॥ అనినవిని యుద్గాత క్రమ్మఱనిట్లనియె. ౨౫౦

—• ఔదుంబరి కుద్గాతవరమిచ్చుట. •—

తే॥ "ఇదిమొదలుగాఁగ యజ్ఞంబు నెవఁడుచేసినను సదోమధ్యమందు నిన్నునిచిప్రీతి
గంధపుష్పాద్యలంకృతంగా నొనర్చి నెఱపు శంభుప్రచారము లిన్దు నెదుట. ౨౫౧

తే॥ అఖిలదేవసమాగమమందె యిట్లు ప్రీతినంటిని నౌదుంబరీ! మదుక్తి
యన్యథాగాదు. మంగళమగును నీకు. నగ్గలంబగు సంతోష మందుమింక. ౨౫౨

కం॥ సదమున నిను స్థాపింపక యెదిగావించినను వ్యర్థమే యయ్యెడి బూ
డిదలోఁ ద్రేల్వఁగఁబడునయ్యదివలె నౌదుంబరీ! మఖావిఘ్నకరీ! ౨౫౩

సీ॥ కందళీ జంబీర ఖర్జూర దాడిమ సహకార పనసాది సత్ఫలములుఁ
కనకసూత్రస్యూత కౌశేయరాంకవాద్యత్యర్ఘ్య నూత్న దివ్యాంబరములుఁ
గ్రైవేయకాంగద కంకణకుండల ముకుటాదికలధౌత భూషణములుఁ
బారిజాతాశోక వకుళాది పరిమళమిళిత నానావిధ మృదుసుమములుఁ
ధూపదీపాదికంబులు నేపడంతి నెటి సదోమధ్యగతయైన నీకొసంగి
కొలుచు నొక్కొక్కదానికిఁ గోటిగుణితఫలముగలిగెడిఁ దప్పకప్పడఁతి కనఘ!

కం॥ ఫలసహితములగు దెసలును నలివేణి! యొక్కపుడె యంబరయానం
బిలఁ గాంత నరీక్షింపుము నలినెడ నీవుఁ యీయము సద్ధేతువునన్" ౨౫౫

వ॥ అనియిట్లు వాక్రుచ్చుటయు దేవతలిట్లనిరి ౨౫౬

తే॥ "యుక్తమైనవాక్య ముక్తము నీచేత భూసురాగ్రగణ్య! భూరిపుణ్య!
యస్మదీయమైన వ్యాహారమునఁగూడ సత్యమగును నిది యసంశయముగ" ౨౫౭

—• ఔదుంబరీ శాపవిమోచనము. •—

వ॥ అనియిట్లు దేవతలు తథాస్తునుచున్న సుద్గాతయుండుముండు మనుచున్న నాయను విమానగృహీతయై వియత్పథంబున విలసిల్లుటయు 'దేవశర్మబిడ్డ దేవియయ్యె' నని నాగరస్త్రీలందఱు నాగుణవతిని జూచుటకు వేగంబుగం జనుదెంచి ఫలములర్పించి కొందఱును వలువలొసంగికొందఱును భక్తిచే బహుభంగులం బూజించిరి. దేవశర్మయు నాశ్చర్యపడుచుఁ బ్రహ్మాస్థాంతరంగంబునఁ బత్నీసహితంబుగం జనుదెంచి ప్రణామమ్మాచరించుటయు ౨౫౮

కం॥ "జనకా! జననీజనకులు తనయులకు నమస్కరింపఁదగునయ్యా? నేఁ
జనుచుంటిఁ ద్రిదివమున. కిప్పనివలనను మరల నాకుఁ బతనముగలుగుఁగా. ౨౫౯

ఆ॥ ఉండుఁ డిటనె యమ్మయును నీవు నేఁడెల్ల. ననిమిషోత్తములను యాచ్నఁజేసి
యీయొడళ్ళతోనె యేఁ దోడుకొనిపోదు స్వర్గమునకుమిమ్ము జనక! నమ్ము" ౨౬౦

వ॥ అని యౌదుంబరి యాశ్వాసించుటయు హర్షించి యనేకజనులాచరించు నాత్మజాతార్చనంబు నవలోకించుచును నఖిలజనులకంటెఁ దమ్ము ధన్యులుగాఁ దలంచుచును దలిదండ్రు లిరువురుం దత్థ్సలంబున వ్యవస్థితులైరి. బంధుజనులందఱు నా బాలం బ్రశంసించుచుం జనుదెంచి. రప్పుడు భృగువు సదస్సునుండి చతురాననుఁ సవిధంబునకుం జని సాంజలిబంధుండై ౨౬౧

తే॥ "క్రతుసదస్సున నుద్గాత కన్యఁదెచ్చి నెత్తిపైఁబెట్టుకొను టేటి నీతియయ్య?
యీ కతంబునఁ దనమార్గమెల్ల నతఁడు వేదబాహ్యంబుగాను గావించినాఁడు. ౨౬౨

కం॥ తన్నాగరకన్యకకుం గ్రన్నన దేవత్వమిడిరెఁ గ్రతుభుజులకడకా.
దిన్న నిఁక సోమపానం బన్నారియు మేముఁ గలసి యటుఁ జేయఁగనా" ౨౬౩

వ॥ అని చెప్పుటయు విధి యాయుద్గాతం బిలిచి ౨౬౪

ఆ॥ "ఎవ్వరీకుమారి? యేమిటి కీసదోమధ్యమునకువచ్చి మాటలాడె?
నేలగొప్పఁజేసి తీబాలికను నీవు? వాస్తవంబు నుడువవలయు నిపుడు" ౨౬౫

వ॥ అనవుడు నుద్గాతయిట్లనియె. ౨౬౬

కం॥ "శాపభ్రష్టత ధరణీప్రాపితగంధర్వి యీపె బ్రాహ్మణకులమం
దే పుట్టెను. నీముఖమున శాపాంతము చెప్పఁబడియె సమరాళినుచే. ౨౬౭

కం॥ కోపమున శాపమిచ్చియు శాపాంతము నాతఁడే ప్రసాదించెను. నే
నాపయి వరమునొసంగితినా పెకు శంకప్రచార మగ్రంబునఁ గాక" ౨౬౮

వ॥ అనియిట్లు బ్రహ్మకు సదుత్తరంబుఁ జెప్పుచుండ ౨౬౯

— బ్రహ్మాదిష్టంబు కనివాగ్రగాంబులువష్పు —

సీ॥ గంధర్వులందఱుం గడుభక్తిమై వేఁ నర్చింపుచుండుదు రన్వహంబు
సిద్ధులు స్వాభీష్టసిద్ధిఁగోరి సతంబు వేనిని బూజింత్రు వివిధగతుల
సాధ్యసమూహంబు శ్రద్ధ వేనిఁ బూజించి సాధింతు రాత్మీయసంపదలను
మరుదోఘములు వేని మతినతిసేవించి మహనీయతములౌదు మనుదు రెపుడు
నట్టిమాతృగణము లౌదుంబరీస్థితి వెండికొండనుండి విన్నవగును
హాటకేశ్వరమున కరుదెంచి యాడుచుం బాడుచును వాసింపఁబరఁగుటయును

వ॥ తత్కోలాహలంబువిని బ్రహ్మవిష్ణ్వింద్రాది సర్వగీర్వాణులును వితాటు
పడి 'యిదియేమి' యని యజ్ఞమంటపమునుండి లేచిరి. పదపడి మాతృగణంబులక్కియుఁ
బద్మజునకుఁ బ్రణమిల్లి ౭౭౧

తే॥ "వాయుదేవుండు మమ్ముఁబిల్వ వచ్చె నార మునకు! నీచేయుమఖమున కధ్వరంబు
లను హవిర్భాగములు లేవుకనుక మాకు బోకనుసలితి మిమ్ముఁ జేరితిమి నిటకు ౭౭౨

కం॥ ఔదుంబరీప్రభావం బీదేశమునఁ జెవులఁబడుదు నీతెంచితి మి
ప్తోదేవ! యావెంగని యభివాదనపూర్వముగఁ గొలిచవచ్చితి మిటకున్. ౭౭౩

కం॥ పర్వతుఁడను పేరిటి గంధర్వుఁడు మహనీయుఁ డతని తనుభవయగు నీ
గీర్వాణసుప్రతిష్ఠిత సర్వాభీష్టంబు లొసఁగు సతులకు నింకన్. ౭౭౪

కం॥ స్థానంబుచూపు మాకు శతానంద! యటన్ వసింతు మందఱము మే
మానందమునను, నలువది పై నెనిమిది మాగణములు. పరికింపు మొగిన్" ౭౭౫

వ॥ అనినవిని యంబుజాసనుండు యజ్ఞమంటపంబు బహుమాతృగణంబులచేతను
త్రయస్త్రింశత్కోటి దేవతలచేతను సంకీర్ణమగుటగనుఁగొని శ్రుతాధ్యయనసంపన్నుండును
నపరబృహస్పతియు నాగరజాతుండును నగు గర్తుఁ బిలిచి మానంబుపీడి ౭౭౬

ఆ॥ "ఈవుపోయి యలువదెనిమిదిగోత్రాల నాగరులను గూర్చి నయముతోడ
నీగణంబు లలువదెనిమిదింటికి నొక్క యొకటి స్థలము నొసఁగుఁడనియు ౭౭౭

తే॥ దాన నీమాతృగణముల కొనరుప్రీతి గాన నీసాయమును నాకుఁ గరుణయుంచి
చేయవలెమీరలనియును జెప్పుమయ్య మధ్యగా! వేగిరముగ నామాటగాను" ౭౭౮

వ॥ అనివాక్రుచ్చుటయు నతం డతిత్వరితంబుగా నరిగి యా నాగరులందఱి
నాహ్వానించి యత్యంతవినయోపేతంబుగా నభివాదనమాచరించి యంతయు వక్కా
ణించె. నంత నాగరు లదివిని యగ్గలంబగు వార్ధకంబున నొక్కొక్కగణమున
కొక్కొక్క రుచిరస్థానం బొసంగిరి. పదపడి మాతృకలు పరమేష్ఠికిం బ్రణమిల్లి
గాయత్రికిం గైమోడ్చి బ్రాహ్మణపవిత్రప్రదేశంబులం బ్రవేశించి తదాదరిత నానా
విధబలిపూజాదుల కానందపడి యాడుచుం బాడుచు నవ్వుచు ౭౭౯

కం॥ "నను గతిమోక్షదులఁ గనఁగా వసిఁడు మిందె సావిత్రి యిటుల్
కనఁబడరు భర్తభోసుతు. లేనగా దెద్దియును హాటకేశ్వరమునకున్" ౨౮౦

— సావిత్రి గాయత్రీగణంబుల శపించుట. —

వ॥ అని పలుకుచుండగ నంతలోఁబున సావిత్రి వచ్చి యజ్ఞశాలం బ్రవేశింపఁ బోవుచుండగ బ్రాహ్మణులు నమస్కరించి ౨౮౧

తే॥ "బ్రహ్మ గాయత్రి పత్నిగాఁ జేపట్టి పదవితిమున్నుఁ బరిణయంబాయె సవనంబు జరుపుచుండె.
నట్లుగావున సావిత్రి! యజ్ఞమందు నీ వధ్వరమున కేగు స్వర్గమునకు" ౨౮౨

వ॥ అని నివారించుచుండగ నాయమ యత్యాశ్చర్యంబున దుఃఖసమోపేతయు బాష్పవ్యాకులలోచనయు నై యమ్మాటల విని మహోత్సాహంబు ప్రకటించు మాతృకలం జూచి గద్గదస్వరంబున నిట్లనియె. ౨౮౩

చ॥ "సవతికి యుక్తగౌరవము సల్పి నమస్కృతిఁ గూడఁ జేయఁ గి
ట్లనుమతి నాకుఁ జేసితిరి. యందున మీరిఁక సెప్ప నాళ్ళకే
నవలఁ జేసి కింద సుమంగళులు ముందును మీ కొకసారున్.
బ్రిదిమలభక్తి నాగరకబ్రాహ్మణపూజలు నుండ దెన్నఁడున్. ౨౮౪

కం॥ చలికాలంబునఁ జలిచే బలుగ్రీష్మమునందు దప్పికటులను జేయన్
జలదాగమమున జలముల నిలఁ దోగుచు నొందుచుండుఁ డీవిధి మిగులన్" ౨౮౫

వ॥ అనియిట్లు శపించి నాగరస్త్రీజనంబులఁ దననుట్టుం జుట్టుకొని యోదార్చుచుండ నందఱుం గూడి దక్షిణదిశకుఁ దరలిపోయె. యజ్ఞమంటపంబున యాజ్ఞికబ్రాహ్మణుల శాస్త్రోక్త వాక్యంబులు మహోద్ధతిఁ బయలువెడలె. నంత శపింపఁబడిన మాతృక లందఱును ౨౮౬

కం॥ "ఈవిధశాపము తప్పదు గావున నోయుంబరీ సకారణమునకున్
బోవుద మాయమ ధరిత్రమున నీ వచ్చిన కుంటుంబాపి యొలమి పొనర్పన్" ౨౮౭

వ॥ అని యామను యంతికంబున కరిగి ౨౮౮

కం॥ "మేమందఱమును దేవరో! యామధుర్యమున కరుగుదెంచుపోటువునం గ
న్యామణికై పోలిచెనికి నీ ప్రేమ సౌభాగ్యములు లభించెను బెలుచన్. ౨౮౯

తే॥ నాగరస్త్రీజనంబుల నమునఁ జేరి సరసదౌర్భాగ్యయుతయయి గరువుపడి
యుండె సావిత్రియు. నంచు నొక్కయింతయేనియును మాకుఁ దెలియఁ గేమిగలదు.

ఆ॥ అధికతంబుగాఁగ నాకుచుం బోడుము నన్న వారమేము తిన్న నిచటఁ
గుడుము చేతికిడినఁ గనఁ బండుగను సేయు యజ్ఞభాగమబ్బ నాశపడమె. ౨౯౦

కం॥ అందులకై శపియించెను నందఱ గాంధర్వసత్తమా! యామె ముమున్
సుందరు లెవరుం జెందని పొందుం బొందంగవలసెఁ గొన కేమింకన్. ౨౯౧

తే॥ వ్యోమయానంబు మొదలగు నున్నతస్థితులకు నెప్పుడును భంగంబుగలుగకుండ
నాచరింపంగవలయుఁ గల్యాణి! నీవు, త్రిజగముల నీదుమహిమంబు స్థిరతఁగాంచ"
వ॥ అనవుడు నౌదుంబరియిట్లనియె. ౨౯౪
కం॥ "సకలసురాసురులకు మతియొకవిధమునఁ జేయరాకయుండెడి సావి
త్రీకృతమునకు మాఱొడ్డుట సుకరమె? యైనను యతింతు శుభమొనఁగూడన్
తే॥ ఆయువదెనిమిదిగోత్రాలయందుమీరు బ్రహ్మచేత నియోజింపఁబడినవార
లట నిశావేళలందున హాస్యముఖరసంజ్ఞలం బూజగైకొని సంతసిలుఁడు. ౨౯౬
ఉ॥ ఈదినమాది నాగరులయొద్దఁ శుభక్రియలందు మీకుఁ బూ
జాదిక మాచరింపఁబడు, నట్టులె కోటులు వీటివాకిటన్
మోదముతోడ హాస్యరసముం గురిపించుచుఁ గొల్చుచుండు రీ
చ్చైదములందు వేల్పులకు జన్నములందలె మీకుఁ దృప్తియౌ. ౨౯౭
కం॥ ఎవ రీ యస్మదుదీరితమవు పూజన మాచరింప, రవ్వారలకున్
దేవుళు లుదయించుఁగావున నవనార్థం బుండుఁడమ్మ యన్నగరమునన్. ౨౯౮
కం॥ శాపవ్యాజంబున మీ కీపగిదిని వరముదొరకె నిఁక నేటికి మీ
రాపద్భంకవహించెద. రీపురిఁ గాఁపురము సేయుఁడీ తమి దేవుల్!" ౨౯౯

— ఔదుంబరి పూర్వజన్మవృత్తాంతము —

వ॥ అనియిట్లు చెప్పుచుండ దేవశర్మ పర్వతాఖ్యగంధర్వుండై పత్నీసహితంబుగా నటకువచ్చె. నౌదుంబరి దుపితుఁడైన నారదమహామునిచే శపింపఁబడినపుడు ౩౦౦
మ॥ "మలమూత్రాదిక సర్వదోషయుతమా మానుష్యగర్భంబునం
దిల నేఁ బుట్టఁగఁజాలఁగాన జనకా! యీ వంబతోఁగూడ భూ
స్థలికిన్ రమ్ము. నరత్వమొందు వయసం ద్వాత్పత్తి గర్భంబునం
దెలమి న్నన్ను సృజింపు. నట్లయిన నా కేమందు లేకుండెడిన్" ౩౦౧
వ॥ అని పర్వతుం బ్రార్థించి యట్లు మనుష్యుండై పుట్టి వానప్రస్థాశ్రమంబున దేవశర్మాఖ్య వర్తిలు నతనిభార్యయం దవతరించినది. యీవిధంబున నయ్యధ్వరంపు శైవరాత్రి యౌదుంబర్యుత్సవంబుతో నతిక్రాంతమగుటయు నాయమ జనకుఁడగు పర్వతుం గాంచి ౩౦౨
కం॥ రేపకడ నిచట నవభృథ. మోపిత! తీర్థంబులెల్ల నుండెడి నట. శ్ర
ద్ధోపేతత స్నాతులమై యీపయి మువ్వురము జనుద మమరయుతముగన్. ౩౦౩
ఉ॥ నాకు వరంబయ్యెనయది నారదశాపము చూడ. దేవతా
నీకసుదుర్లభంబుగను నిర్మితమై తగు యాగభాగమే
నాకు లభించెఁ జక్కఁగను. నాయన! యింకను జౌర్ణమాసియం
దీకమలాత్ములెల్లరును నెంతయు నన్ను భజింపఁగాంచితిన్. ౩౦౪

౭ నారాయణరావుగారు, దాతారుపల్లి

౮ వేలూరి రామన్న గుప్తగారు, సదాశివునిపేట

౯ రాయచూరి బండేరావుగారు, అయినాపురం

౧౦ రాచూరి సుబ్బయ్యగారు – శ్రీ శ్రీ విరూపాక్షసంస్థాన ప్రధానమంత్రి

౧౧ ఘంటంభట్ల గారి వెంకటభుజంగముగారు – ముసలాపురం

౧౨ దండు గుండేరావుగారు, కరణము – ముసలాపురం

౧౩ తిగుళ్ళ కృష్ణారెడ్డిగారు. పటేలు – ముసలాపురం

౧౪ కాకుమాను హనుమయ్యగారు, నర్సారావుపేట

౧౫ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

౧౬ భాస్కరరాయని వెంకట రామయ్యగారు, వంగపల్లి

౧౭ నరసింహాస్వామివారు, యాదగిరి

౧౮ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి

౧౯ జూలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు

౨౦ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి

౨౧ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, పాపయపాలెము

౨౨ చిక్కరాజు మట్టపల్లి రావుగారు, కరణం, చెలకుర్తి

౨౩ కవులూరి నరసింహారావుగారు, ఈలప్రోలు

౨౪ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసుసబిన్స్పెక్టరు, ప్రత్తిపాడు

౨౫ నడింపల్లి నరసింహారావుగారు, రిజిష్ట్రరాఫీసు క్లార్కు, క్రోసూరు

౨౬ రాచకొండ వెంకటరామయ్యగారు, యెనమదల

౨౭ కప్పగంతు సుబ్బారావుగారు – పోలీసుసబిన్స్పెక్టరు – పిడుగురాళ్ళ

౨౮ మండ చినవెంకయ్యగారు, దండమూడి.

౨౯ శ్యామాపంతులగోపాలరావుగారు – వరంగల్లు

౩౦ కన్నయ్యగారిసంగయ్యగారు–ముసలాపురం

౩౧ చక్కిలం పాపయ్యగారు–ముసలాపురం

౩౨ తాళవెలిమె లింగన్న మొకద్దంగారు–గడిపెద్దాపురం

౩౩ కిషన్ రావు దేశపాండ్యాగారు తాళ్లపల్లి

౩౪ తోర్లకొండ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం.

౩౫ రంగజు గోపాలకిషన్ రావు – దేశముఖుగారు, షాపురం

౩౬ చివుకుల శ్రీరామశర్మగారు– నాగులుప్పలపాడు

౩౭ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౮ కాకిరాల రామచంద్రయ్యగారు, మముదాపురము

౩౯ లక్ష్మీనారాయణ గౌడు సెట్టిగారు, అంధోలు

౪౦ ఇటిక్యాల రాజేశ్వరరావుగారు – వకీలు కంభంమెట్టు

అభినవసరస్వతి

సంపాదకుడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనము లును వ్యాసములును బ్రకటింపబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు.

1	కరిణీకోద్ధారిణి [పూరె వీరభద్రకవి]	...	0	4	0
2	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
3	కంసవధ నాటకము	...	0	8	0
4	చమత్కారమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)		0	4	0
5	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
6	నీతిగీతులు (సుమతీశతకమునకు సంస్కృతము)	...	0	2	0
7	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
8	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
9	చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	...	0	1	0
10	సంగదోషము	...	0	3	0
11	అస్పృశ్యతానివారణ ఖండనము (మల్లాది రామకృష్ణ చయనులు గారు)		0	8	0
12	వత్సలనీతిశతకము	...	0	1	0
13	శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి)	...	0	4	0
14	నర్సారావుపేట శతావధానము (తిరుపతి వెంకటీయము)		0	3	0
15	పశ్యాంపుశ్యాం	...	0	2	0
16	పశ్యశబ్దవిచారము	...	0	2	0
17	పురశ్చరణము	...	0	2	0
18	కంతినరాజచరిత్ర	...	0	14	0
19	వర్ణవ్యవస్థ	...	0	4	0
20	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
21	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
22	అభినవశాకుంతల నాటకము	...	0	8	0
23	సూతసంహిత-ఆంధ్రము	...	2	0	0
24	స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)		1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
26	భారతీయప్రబోధము (పిసుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0
27	ధర్మనిర్ణయము		0	4	0
28	భారతకథాతత్త్వనిర్ణయము (మల్లాదిరామకృష్ణవిద్వచ్ఛయనులుగారు)		0	4	0

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరు జిల్లా